RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 02 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ శుక్రవారం 03-04-2026 పేజీలు: 8, వెల : 2.00

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న తెలంగాణ వాణి తెలుగు దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు

జిల్లా వారిగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారిగా ఆర్‌సి ఇన్చార్జులు, మండలాల వారిగా విలేకరులు కావలెను

సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది

ఈ క్రింది నెంబర్‌కు వాట్సప్ ద్వారా తమ వివరాలు సంప్రదించగలరు

9441558369
9703247143
9493658107




2వ పేజీలో...

## సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోరం..

### ఏడుగురు మహిళా కూలీల

# దుర్మరణం

ముంబాయి: మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జల్నా జిల్లాలోని సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన ఈ దుర్ఘటనలో ఏడుగురు మహిళా కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కడ్వాంచి గ్రామ సమీపంలో కూలీలతో వెళ్తున్న ఓ మినీ ట్రక్కును వేగంగా వచ్చిన మరో ట్రక్కు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బాధితులంతా ఎక్స్‌ప్రెస్‌వే పనులకు వెళ్తున్న కూలీలు. వారు ప్రయాణిస్తున్న మినీ ట్రక్కును ముంబై వైపు వెళ్తున్న ఓ భారీ ట్రక్కు వెనుక నుంచి ఢీకొట్టింది.

## రాష్ట్రమంతటా మొదలైన..

# గ్రామ సభలు



### సీఎం రేవంత్ రెడ్డి కీలక సందేశం

హైదరాబాద్,: 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఇవాళ రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశం ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యిందని, ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ, సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మేం పాలకులం కాదు. సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నామని పునరుద్ఘాటించారు. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నామని స్పష్టం చేశారు.

2వ పేజీలో...



2వ పేజీలో...

## రెండు మూడు వారాల్లో

## ఇరాన్‌పై అతి భీకర

# దాడులు

### ట్రంప్ కీలక ప్రకటన

వాషింగ్టన్: ఇరాన్‌తో కొనసాగుతోన్న యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. రానున్న రెండు, మూడు వారాల్లో ఆ దేశంపై భీకర దాడులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇరాన్ కీలక నాయకత్వం అంతమైందని, ఆ దేశ నౌకాదళం, ఎయిర్‌ఫోర్స్ తుడిచిపెట్టుకుపోయాయన్నారు.



2వ పేజీలో...

## అమరావతికి చట్టబద్ధతకు

# థాంక్స్

### ప్రధాని మోడీకి లోకేశ్ కృతజ్ఞతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్2 : అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. గురువారం బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టారు. హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు.



2వ పేజీలో...

## ఏడుగురు జడ్జీల నిర్బంధం

## బెంగాల్ సర్కారుపై

# సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం



## కాంట్రవర్శికి కేరాఫ్ గా

# అనిరుధ్ రెడ్డి

మహబూబ్ నగర్, ఏప్రిల్ 2, : జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేరు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అసెంబ్లీ లోపల, బయట ఆయన చేసే వ్యాఖ్యలు వరుస వివాదాలు సృష్టిస్తున్నాయి. ఒక వివాదం సద్దుమనగక ముందే మరో వివాదాస్పద వ్యాఖ్య చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. సినిమా స్టైల్ డైలాగులు, విప్ప సారా కావాలంటూ ప్రతిపాదనలు, అక్రమ కట్టడాలపై విమర్శలు అధిష్టానానికి తలనొప్పిగా మారుతున్నాయా లేక పార్టీకి అస్త్రాలవుతున్నాయా అన్న చర్చ మొదలైంది. సినిమా స్టార్స్‌కి డ్రగ్స్ టెస్ట్ చేయాలన్న అంశంపై అనిరుద్ రెడ్డి తాజా వ్యాఖ్య మరోసారి షేక్ చేస్తోంది. సినీ నటులకు భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుంది. హీరోల ప్యాంటు జేబులు లెక్కపెట్టే ఫ్యాన్స్ ఉన్న దేశం ఇది. వాళ్లేం చేస్తే తామూ అది చేయాలనుకుంటారు. అందుకే వాళ్ళు అందరికీ ఆదర్శంగా నిలిచేలా డ్రగ్స్ తీసుకోలేదని సర్టిఫికేట్ తెస్తేనే సినిమా రిలీజ్ చేయాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో ప్రకంపనలు సృష్టించాయి. ఇది సినీ నటులను కించపరచడమే.. వారిపై అనుమానాలు కలిగించడమే అంటు సినీ ప్రముఖులు స్పందిస్తున్నారు. కేవలం హీరోలే ఎందుకు, రాజకీయ నాయకులకూ ఇలాంటి పరీక్ష పెట్టే ఎన్నికల పోటీకి అనుమతించాలని మంచు విష్ణు కౌంటర్ ఇచ్చినా, అనిరుధ్ మాత్రం వెనక్కి తగ్గలేదు. ఇప్ప సారా తెలంగాణ టెకిలా అంటూ అసెంబ్లీలో ఆయన చెప్పిన మాటలు సభ్యులనే ఆశ్చర్యపరిచాయి. ఇప్ప సారా తాగితే 100 ఏళ్లు బతుకుతారు, ప్రభుత్వమే ఇప్ప సారా తయారీ చేయాలి అంటూ ప్రభుత్వానికి సలహా కూడా ఇచ్చారు.

2వ పేజీలో...



## కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను

## సోషల్ మీడియా వేదికగా

# ఎండగట్టాలి

### మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

సంగారెడ్డి : కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటాన్ చెరు నియోజకవర్గం బొల్లారంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండీ ఆరిఫ్ తో పాటు మరో 25 మంది సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాల రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరార. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..ప్రస్తుత రాజకీయాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలంటే సోషల్ మీడియాలో అత్యంత చురుకుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

2వ పేజీలో...

హైదరాబాద్, : రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతోపాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం, పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి.



2వ పేజీలో...



## ఈ వేసవిలో మండుటెండలు

# ఖాయం

- మూడు నెలలు ఎండలు, వడగాలులు తప్పవు
- భారత వాతావరణశాఖ హెచ్చరిక

# సంపాదకీయం

## కేరళలో ఐదు గ్యారంటీలు గట్టెక్కిస్తాయా

ఆరు గ్యారంటీలు ఇచ్చి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఇదే తరహా వ్యూహాన్ని కేరళంలోనూ అమలు చేస్తోంది. మలయాళీలకు ఐదు గ్యారంటీలను హస్తం పార్టీ ఆఫర్ చేస్తోంది. తెలంగాణ తరహాలోనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే అక్కడి బడ్జెట్ పరిమితులు, ప్రజల ఆలోచనా విధానాన్ని దృష్టిలో ఉంచుకొని మిగతా హామీల అమలు విషయంలో హస్తం పార్టీ ఆచితూచి వ్యవహరించింది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా.. ఏప్రిల్ 9న కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్‌కు కొద్ది రోజులే గడువు ఉండటంతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈసారి కేరళంలో బీజేపీ కూడా బలంగా ప్రచారం చేస్తోంది. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో త్రిముఖ పోరు ఉండే అవకాశం ఉంది. అయితే చాలా చోట్ల మాత్రం పోటీ ప్రధానంగా అధికార ఎల్డీఎఫ్, ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమి యూడీఎఫ్ మధ్యే ఉండే అవకాశం ఉంటుందని అంచనా. గత పదేళ్లుగా కేరళలో అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తుండగా.. ఈసారి ఎలాగైనా మలయాళీల మనసు గెలవాలని హస్తం పార్టీ పట్టుదలతో ఉంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ.. ఇప్పుడు మలయాళ గడ్డ మీద పాగా వేయడం కోసం ఐదు గ్యారంటీలను సిద్ధం చేసింది. మహిళలు, యువతను తమవైపు తిప్పుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ హామీలను ఇచ్చింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కేరళంలోనూ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇప్పటికే కర్ణాటక, తెలంగాణల్లో ఈ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. కాలేజీలకు వెళ్తున్న అమ్మాయిలకు నెలకు రూ. 1000 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని కేరళంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. తెలంగాణలో ప్రతి మహిళకు నెలకు రూ. 2500 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ హామీ తెలంగాణలో ఇంకా అమలు కాలేదు. దీంతో కేరళంలో ఈ హామీని మార్చారని భావించొచ్చు. కేరళలో ప్రస్తుతం నెలకు రూ. 2 వేల చొప్పున పెన్షన్లు ఇస్తుండగా.. దాన్ని రూ. 3 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. తెలంగాణలో ఫించన్లను రూ. 4 వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే ఈ హామీ కూడా ఇంకా అమలు చేయలేదు. ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్య బీమాను అందిస్తామని కేరళ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ పథకానికి కేరళ మాజీ సీఎం ఉమెన్ చాందీ పేరు పెడతామని ఆ పార్టీ ప్రకటించింది. తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కారు ఆరోగ్య శ్రీ పరిధిని రూ. 10 లక్షలకు పెంచిన సంగతి తెలిసిందే. యువత వ్యాపారాలు చేసుకోవడానికి వీలుగా చిన్న వ్యాపారాల కోసం రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని కేరళ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వృద్ధుల సంక్షేమాన్ని పర్యవేక్షించడం కోసం ప్రత్యేకమైన మంత్రిని నియమిస్తామని కేరళ కాంగ్రెస్ ప్రకటించింది. రబ్బరు సాగు చేసే రైతులను ఆకట్టుకోవడం కోసం కిలో రబ్బరుకు రూ. 250 చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని ఎకరానికి ఏడాదికి రూ. 10 వేల నుంచి రూ. 16 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల ముంగిట హామీ ఇచ్చింది. అలాగే వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని, వరికి క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని హస్తం పార్టీ హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి సాయం 'రైతు భరోసా'ను ఎకరానికి రూ. 12 వేలకు మాత్రమే పెంచింది. రూ. 2 లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ హామీని దాదాపుగా నెరవేర్చింది. ఇందిరమ్మ ఇండ్లు పేరిట సొంత స్థలం ఉన్న పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని, గృహ జ్యోతి కింద ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తామని తెలంగాణ ఎన్నికల ముంగిట హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ హామీలను అమలు చేస్తోంది. అలాగే పేద కుటుంబాలకు రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలంగాణలో హస్తం పార్టీ హామీ ఇచ్చింది. యువ వికాసం కింద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం రూ. 5 లక్షల వరకు సాయం చేస్తామని.. ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. మహిళలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఉచిత బస్సు ప్రయాణం హామీని ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఇచ్చింది. రైతుల కోసం తెలంగాణలో పెట్టుబడి సాయాన్ని భారీగా పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ ఆ స్థాయిలో పెంచలేకపోయింది. అలాగే తెలంగాణలో మహిళలందరికీ రూ. 2500 చొప్పున ప్రతినెలా ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ.. ఇంకా అమలు కాలేదు. దీంతో కేరళంలో కాలేజీకి వెళ్లే అమ్మాయిలకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున సాయం చేస్తామని హామీ ఇచ్చింది. ఆరోగ్య బీమా విషయంలో మాత్రం తెలంగాణ కంటే మెరుగ్గా కేరళంలో హామీ ఇచ్చింది. తెలంగాణకు వచ్చే ఆదాయం ఎక్కువ, ఇక్కడి బడ్జెట్ ఎక్కువ. సంక్షేమ పథకాలకు ఇక్కడ ప్రాధాన్యం ఎక్కువ. దీంతో సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణలో కాంగ్రెస్ హామీలు ఇచ్చింది. 2026-27 తెలంగాణ బడ్జెట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకే రూ. 50 వేల కోట్లకుపైగా కేటాయించింది. కానీ కేరళం విషయానికి వస్తే.. ఆ రాష్ట్ర ఆదాయం తెలంగాణతో పోలిస్తే తక్కువ. అక్కడి ప్రజలు బాగా చదువుకున్నవారు. ఇప్పుడు అక్కడున్న ఉచిత పథకాలు కూడా తెలంగాణ స్థాయిలో లేవు. దీంతో అక్కడి పరిస్థితులకు తగ్గట్టుగా, మలయాళీలను ఆకట్టుకునేలా హామీలు ఇచ్చింది. తెలంగాణలో లాగే కేరళంలోనూ మహిళలు, యువతను తమవైపు తిప్పుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నం ఎంత మేర సక్సెస్ అవుతుందనేది మరి కొద్ది రోజుల్లోనే తేలనుంది.

# వైఎస్ ఫ్యామిలీలో కలహాల కాపురం



కడప, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం వైఎస్సార్ కుటుంబ అంతర్గత కలహాలు పెను దుమారం రేపుతున్నాయి. ఒకప్పుడు అభేద్యమైన కోటలా కనిపించిన ఈ కుటుంబంలో ఆస్తి పంపకాలు, వ్యక్తిగత విభేదాలు వీధిన పడటం చర్చనీయాంశంగా మారింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్ షర్మిల మధ్య సాగుతున్న ఈ పోరు కేవలం కుటుంబ వ్యవహారంగా మిగిలిపోకుండా రాజకీయ రంగు పులుముకోవడం వల్ల అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాజకీయాల్లో అత్యున్నత పదవుల్లో ఉన్న నాయకులకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో కీలకం. జగన్ తన సోదరి షర్మిల లేవనెత్తుతున్న ఆస్తి వాటాల అంశాన్ని ప్రతిపక్షాల కుట్రగా భావించడం, చంద్రబాబు నాయుడు ట్రాప్‌లో ఆమె పడ్డారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపించడం గమనార్హం. వ్యక్తిగత సమస్యలను రాజకీయ కోణంలో ఎదుర్కోవడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంది. తమిళనాడులో కరుణానిధి వారసుల మధ్య జరిగిన ఘర్షణలు, ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ యాదవ్ కుటుంబ సభ్యుల మధ్య తలెత్తిన విభేదాలు ఆయా పార్టీల ప్రతిష్టను భారీగా దెబ్బతీశాయి. ఇప్పుడు ఏపీలో కూడా జగన్ తన తల్లి విజయమ్మ, సోదరి షర్మిలపై పార్టీ నేతలతో విమర్శలు చేయించడం సొంత కేడర్‌ను సైతం విస్మయానికి గురిచేస్తోంది. రక్తసంబంధీకులపై ఇలాంటి ఆరోపణలు చేయడం వల్ల ప్రజల్లో జగన్ పట్ల ఒక రకమైన ప్రతికూల భావన ఏర్పడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అమ్మ, చెల్లి ఇద్దరూ ప్రత్యర్థుల చేతిలో పావులుగా మారారనే ప్రచారం సామాన్య ఓటర్లలో ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. తన సొంత కుటుంబ సభ్యులనే ఒప్పించలేని, మెప్పించలేని నాయకత్వం రాష్ట్ర ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తుందనే ప్రశ్నలు తలెత్తుతాయి. షర్మిల ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలిగా రాజకీయ విమర్శలు చేస్తున్నప్పుడు వాటిని రాజకీయంగానే తిప్పికొట్టాలి. అలా కాకుండా ఆస్తుల గొడవను తెరపైకి తెచ్చి ఆమెను వ్యక్తిగతంగా దూషించడం వల్ల వైఎస్సార్‌సీపీ ఇమేజ్ డ్యామేజ్ అవుతోంది తప్ప ప్రత్యర్థులకు ఆయుధాలు ఇచ్చినట్లు అవుతోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. కుటుంబ సమస్యలను నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోకపోవడం వల్ల రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఒకప్పుడు జగన్ వెనుక కొండంత అండగా నిలిచిన విజయమ్మ, షర్మిల నేడు ఆయనకు దూరంగా జరగడం అనేది భావోద్వేగపూరితమైన ఆంధ్ర ఓటర్ల మనోభావాలను దెబ్బతీస్తుంది. రాజకీయాల్లో ప్రత్యర్థులతో మైండ్ గేమ్స్ ఆడటం సహజం కానీ, అది కన్నతల్లి, కన్నచెల్లితో సాగితే ప్రజల నుంచి వచ్చే స్పందన మరోలా ఉంటుంది. ఈ వివాదం ఎంత కాలం సాగితే అంతగా వైఎస్సార్ వారసత్వంపై ప్రజలకున్న నమ్మకం సడలిపోయే ప్రమాదం పొంచి ఉంది. వ్యక్తిగత ఆస్తుల వివాదాలు రాజకీయాల్లోకి చొచ్చుకురావడం వల్ల ప్రతిపక్ష పార్టీగా ఎలా పని చేస్తున్నారు అనే దానికన్నా.. ఈ వివాదమే హైలెట్ అవుతుంది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు గానీ, సంబంధిత రాజకీయ పార్టీకి గానీ అంత మంచిది కాదు. జగన్ ఈ అంశాన్ని కేవలం ఒక రాజకీయ నాయకుడిలా కాకుండా ఒక అన్నగా కుటుంబ పరిధిలోనే ముగించుకుంటేనే ఆయన వ్యక్తిగత ఇమేజ్‌కు మేలు జరుగుతుంది. లేకపోతే ఈ అంతర్గత కలహాలే భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీకి తీరని నష్టం చేకూర్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# ఆదిలాబాద్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



ఆదిలాబాద్, ఏప్రిల్ : 02 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) :అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా బస్టాండ్ సమీపంలో అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, పాపన్న గౌడ్ విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్దార్ పాపన్న గౌడ్ 18వ శతాబ్దంలోనే నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహా సామాజిక విప్లవకారుడని కొనియాడారు. సామాజిక సమానత్వం కోసంతన జీవితాన్ని అంకితం చేసిన గొప్పనాయకుడిగా గుర్తు చేశారు. పాపన్న గౌడ్ కేవలం ఒక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, అన్ని వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని తెలిపారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన ఆయన ఆదర్శాలు నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ పాపన్న గౌడ్ ఆశయాలకు అనుగుణంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తూ యువతకు ఆయన చరిత్రను పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, బీసీ అభివృద్ధి అధికారి దరావత్ సోనియా, జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



## వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో గ్రామ సభ
## గ్రామ అభివృద్ధి నా ఎజెండా సర్పంచ్ రాయిచెట్టి చంద్రయ్య

సైదాపూర్ : ఏప్రిల్ :2 ( తెలంగాణ వాణి విలేకరి ): సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో గురువారం రోజున గ్రామ సర్పంచ్ రాయిచెట్టి చంద్రయ్య ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామ సభ ను నిర్వహించారు సర్పంచ్ రాయి చెట్టి చంద్రయ్య మాట్లాడుతూ వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో నూతనంగా 27 కొత్త రేషన్ కార్డులు వచ్చాయి అని అర్హులు అయిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు లబ్ధి అయ్యేలా చూస్తాము అని అర్హులు అయిన ప్రతి ఒక్కరికి వితంతు పింఛన్ వికలాంగుల పింఛన్ వృద్ధాప్య పింఛన్ అందేలా చూస్తాము అని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పదవ తరగతి పిల్లలతో పాటు 11వ తరగతి 12వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడం జరుగుతుంది అని విద్యార్థులకు టిఫిన్ కూడా పెట్టడం జరుగుతుంది అని తెలిపారు గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాను అని ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ఒకటి 5 కోట్ల కుటుంబాలకు ఐదు లక్షల జీవిత బీమా ఇవ్వడం జరుగుతుంది అని ఈ యొక్క పథకం ఉద్దేశం వ్యవసాయ భూమి లేకపోయినా ఇంటి యజమాని చనిపోయినప్పుడు ఐదు లక్షల జీవితం భీమ వర్తిస్తుంది అని వ్యవసాయ భూమి ఉన్న వారికి కూడా ఈ యొక్క పథకం వర్తిస్తుంది అని సర్పంచ్ రాయిచెట్టి చంద్రయ్య తెలిపారు స్పెషల్ ఆఫీసర్ ఏపీఎం తిరుపతి మాట్లాడుతూ మహిళ సంఘాలు 20 గ్రూపులు కోటి 16 లక్షల 64 వేల రూపాయలు వడ్డీ లేని రుణం ద్వారా తీసుకున్న 15 గ్రూపులకు 6, లక్షల 11,000 వేల రూపాయలు తీసుకోవడం జరిగింది అని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయిచెట్టి చంద్రయ్య, ఉప సర్పంచ్ సులోచన, స్పెషల్ ఆఫీసర్ ఏపీఎం తిరుపతి, కార్యదర్శి కొండల్ రెడ్డి,వార్డు నెంబర్లు వేముల సుమలత, బత్తుల మోహన్, బత్తుల స్రవంతి, ఎర్రల శంకర్, గుర్రం కుమారస్వామి, దయ్యాల శ్రీనివాస్, చంద్రమౌళి,ఏ ఎన్ ఎం,స్వర్ణలత, ఆశ వర్కర్ ఎర్రల శ్యామల, అంగన్వాడీ టీచర్ అమరావతి,స్కూల్ టీచర్ విష్ణు, ఎలక్ట్రిసిటీ లైన్మెన్ శ్రీకాంత్, మహిళా సంఘం అధ్యక్షురాలు భాష వేణి లీల, రాయిశెట్టి రజిత, వి ఓ ఏ రజిత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# సామాన్యుడి ముంగిటకే సర్కారు పాలన



## కొడవటూరు గ్రామ సభలో సరికొత్త అధ్యాయం!

బచ్చన్నపెట:ఏప్రిల్02 (తెలంగాణ వాణి ప్రతినిది): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా కొడవటూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ ప్రజా పాలనకు ఒక నిలువుటద్దంగా నిలిచింది. సర్పంచ్ నీల కవిత మురళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నేరుగా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను విన్నారు. గతంలో ఏవైనా పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ప్రభుత్వమే ప్రజల వద్దకు రావడం శుభపరిణామమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, ప్రతి అర్హ కుటుంబానికి పారదర్శకంగా అందడమే ఈ 99 రోజుల లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టమైంది. ముఖ్యంగా గ్రామాల్లోని మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, వైద్యం మరియు వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ఈ ప్రణాళిక ఒక వేదికగా మారింది. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా పాలనలో వేగం పెరిగిందని, దీనివల్ల సామాన్యులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుతున్నాయని సర్పంచ్ పేర్కొన్నారు. ఉప సర్పంచ్ గంగం దయాకర్ రెడ్డి మరియు ఇతర వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్ల సమన్వయంతో సాగిన ఈ సభ, కొడవటూరు గ్రామ అభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని వెనువెంటనే పరిష్కరించే ఈ విధానం నియోజకవర్గవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# అక్రమ ఇసుక రవాణాపై అధికారుల దాడులు..

## 150 ట్రాక్టర్ల ఇసుక సీజ్



దిశ, రాజోలి: స్థానికంగా అక్రమంగా భారీ స్థాయిలో ఇసుక రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన ఇసుక నిల్వలను పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడి చేసి సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముందస్తు చర్యగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో పెద్ద మొత్తంలో ఇసుక నిల్వలను అధికారులు గుర్తించారు. సీజ్ చేసిన ఇసుక పరిమాణం దాదాపు 150 ట్రాక్టర్ల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన ఈ ఇసుకను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ఇంత భారీ స్థాయిలో ఇసుక పట్టుబడిన ఈ దాడికి సంబంధించి ముందుగానో, కనీసం దాడి అనంతరం మీడియాకు సమాచారం ఇవ్వకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇలాంటి కీలక ఆపరేషన్‌ను గోప్యంగా ఉంచడం వెనుక కారణాలేమిటన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందిస్తూ.. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇసుకను అక్రమంగా తవ్వడం, నిల్వ చేయడం, రవాణా చేయడం పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతరం నిఘా కొనసాగిస్తామని తెలిపారు. స్థానిక ప్రజలు ఈ దాడిని స్వాగతిస్తూ, మరోవైపు పారదర్శకత పై సందేహాలు వ్యక్తం చేస్తూ, ఇలాంటి ఘటనలపై పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## మల్లపురాజుపల్లి లో ఘనంగా
# హనుమాన్ జయంతి వేడుకలు



నాంపల్లి:ఏప్రిల్ 2 (తెలంగాణ వాణి ప్రతినిధి): హనుమాన్ జయంతి సందర్భంగా నాంపల్లి మండలం మల్లపురాజుపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో హిందూవాహిని ఆధ్వర్యంలో భక్తి,శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి మూల విరాట్ కి పంచామృతాభిషేకం చేశారు, అనంతరం ఉత్సవ విగ్రహనికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు పంపిణి చేశారు. అనంతరం డీజే హనుమాన్, శ్రీరాముని భక్తి పాటలతో మల్లపురాజుపల్లి పుర విధులలో శోభయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా పటాన్ చెరు లో భారీ ర్యాలీ నిర్వహించిన వీ ఎచ్ పీ



పటాన్ చెరు, ఏప్రిల్ 2, (తెలంగాణ వాణి రిపోర్టర్): గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా పటాన్ చెరు పట్టణంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పంచముఖి హనుమాన్ దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బైక్ ర్యాలీలో ఎం డీ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మాద్రి పృథ్వీరాజ్, పలువురు కార్య కర్తలుపాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఎల్ఏ సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి కూడా పాల్గొని కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకు వచ్చారు. భక్తి, ఐక్యత, దేశభక్తిసందేశాలను చాటిచెప్పిన ఈర్యాలీవిజయవంతంగా నిర్వహించారు.

## ప్రజా సంక్షేమానికై వార్డు సభ

రాయికల్: ఏప్రిల్ 02(తెలంగాణ వాణి): ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా గురువారం రోజున రాయికల్ పట్టణము 4వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ తురగ సౌజన్య-శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన వార్డు సభ నిర్వహించడం జరిగినది. ఇట్టి సభలో వివిధ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగినది. అలాగే ప్రజల నుండి వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించిన సలహాలు సూచలను,ఫిర్యాదులను స్వీకరించడం జరిగింది. ఇట్టి వార్డు సభ కు ప్రత్యేక అతిథులు గా మున్సిపల్ కమీషనర్ కె.నాగరాజు,తహశీల్దార్ నాగార్జున,ఎంఈవో రాఘవులు,సబ్ ఇన్స్పెక్టర్ సుధీర్ రావు,హౌసింగ్ ఏఈ తిరుమల,వార్డు అధికారి బి.రాకేష్ రావు,ఆర్.పి రిజ్వాన,ఏ ఎన్ ఎం విజయ లక్ష్మి, అంగన్వాడీ టీచర్స్ సుమలత,రజిత,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై పోరు.. పెద్దన్నకు బేజారు



ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా-ఇజ్రాయిల్ దుష్ట కూటమి ఇరాన్‌పై ప్రారంభించిన దాడులకు ముందు వారు అనుకున్నది ఒకటి. అయింది, అవుతున్నదీ మరొకటి. ఉన్మాదంతో ట్రంప్ ఏం మాట్లాడుతున్నాడో, ఏం చేస్తున్నాడో చూస్తున్నాం. ఇది రాస్తున్న సమయానికి హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తెరవకపోయినా దాడులను ముగించాలనుంది అన్నట్లుగా వార్తలు వచ్చాయి. అయినప్పటికీ భీకర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. దాడులు ఐదవ వారంలో ప్రవేశించాయి. కాల్పుల విరమణ చర్చల సంగతి ఎటూ తేలలేదు, అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పింది. పరిస్థితి ఇలా ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు (డాలరకు 95 రూపాయలు) ఖర్చు అవుతున్నాయి. ప్రపంచం 1970 దశకం నాటి స్టాగ్‌ఫ్లేషన్‌కు (ఆర్థికరంగం గిడసబారటం, ధరలు, నిరుద్యోగం పెరుగుదల దీని లక్షణాలు) గురవుతుందా అని కొందరు సందేహిస్తుండగా పరిస్థితి తీవ్రంగా ఉంది తప్ప అలాంటి అవకాశం లేదని మరికొందరంటున్నారు. అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడు సార్లు అక్కడి కార్మికవర్గం రాజులు లేరు, రాజరికాలు లేవు అంటూ ట్రంప్‌నకు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేశారు. తొలిసారి 50, రెండవసారి 70, మూడవసారి 90 లక్షల మంది పాల్గొన్నారు. మూడవసారిమార్చి చివరివారంలో జరిగిన ప్రదర్శనల్లో అమెరికాలో జరిగిన రోజునే వివిధ ఖండాలలోని పన్నెండు దేశాలలో కార్మికులు స్థానిక సమస్యలను తీసుకొని ప్రదర్శనలు జరపటంవిశేషం. అమెరికా వినియోగదారులపై భారం ఎలా పడిందంటే ఫిబ్రవరి నెలలో జాతీయ సగటుగ్యాస్ ధర 2.98 డాలర్లు ఉంటే ఆదివారం నాడు అది 3.98 డాలర్లు ఉంది. సరఫరా, ధరల నియంత్రణలో భాగంగా 32 దేశాలు, 13 సహదేశాలు (వీటిలో మన దేశం లేదు) సభ్యులుగా ఉన్న అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) తన పర్యవేక్షణలో ఉన్న 120 కోట్ల పీపాల చమురులో 40 కోట్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఆ సంస్థ నిబంధన ప్రకారం ప్రతి సభ్యదేశం 90 రోజులకు సరిపడా చమురు ఉత్పత్తులను నిల్వ చేసుకోవాలి. ఈ యుద్ధం ప్రపంచ చమురు మార్కెట్ చరిత్రలో సరఫరా విచ్ఛిన్నంలో అతి పెద్దదని ఆ సంస్థ పేర్కొన్నది. దీనికి ట్రంప్ బాధ్యుడని వేరే చెప్పనవసరం లేదు.

ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటివిలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. అమెరికాలో జతకూర్చిన సమాచారం ప్రకారం ఒక్క రోజులో ఎస్ అండ్ పి 500 సూచిక 1.66 శాతం పతనంతో ఒక లక్ష కోట్ల డాలర్లు, నాస్‌డాక్ 2.09 శాతం పతనంతో ఆరు వందల బిలియన్ డాలర్లు, డౌ సూచిక 1.2 శాతం పతనం 300 బి. డాలర్లు మొత్తం ఒక్క రోజులో 1.2 లక్షల కోట్ల డాలర్లు ఆవిరైంది. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగుతుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. అమెరికాలో ఉత్పత్తి అయ్యే డబ్ల్యుటిఐ రకం ముడి చమురు ధర 2025 డిసెంబరులో 57 డాలర్లు ఉంటే ఇది రాసిన సమయంలో 102 డాలర్లు ఉంది. దీనికి అనుగుణంగానే అమెరికాలో ధరలు పెరిగాయి. ఫిబ్రవరిలో విమాన ఇంధనం పీపా ధర 99 డాలర్లు ఉంటే మార్చి నెల 20న 197 డాలర్లకు పెరిగింది. స్లోక్ అనే ఆర్థికవేత్త జనవరిలో అమెరికా ఆర్థిక స్థితి గురించి ఆశాభావం వెలిబుచ్చాడు. ఎప్పుడైతే ట్రంప్ యుద్ధాన్ని ప్రారంభించాడో ఇప్పుడా పెద్దమనిషి స్టాగ్‌ఫ్లేషన్ అవకాశాల గురించి హెచ్చరించాడు.

ముందే చెప్పుకున్నట్లు డోనాల్డ్ ట్రంప్ అనుకున్నది ఒకటి. జరుగుతున్నది మరొకటి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్తి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండడు. పెట్రో డాలర్‌ను సవాలు చేస్తూ చైనా యువాన్‌తో లావాదేవీలు జరిపేవారి నౌకలను హోర్ముజ్ జలసంధి నుంచి అనుమతిస్తామని అది ప్రకటించింది. ఆ కరెన్సీలోనే అది కప్పం వసూలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇరాన్ యుద్ధం చైనా పెట్రో యువాన్‌కు శక్తినిస్తుందని అమెరికా డాలర్ ఆధిపత్యం బలహీనపడుతుందని ఈ పరిణామాల గురించి హాంకాంగ్ నుంచి వెలువడే సౌత్ చైనా మోర్నింగ్ పోస్ట్ పత్రిక వ్యాఖ్యానించింది. ఇతర దేశాలను తన అదుపులో ఉంచుకొనేందుకు తనకు అనుగుణంగా ఆడించేందుకు ఉక్కిరి బిక్కిరి చేసే అంశాలుగా ప్రపంచంలోని చమురు సంపద, ఇతర వనరులను వినియోగించుకొనేందుకు వాటి మీద అదుపు సాధనకు అమెరికా ఎప్పుడో ఎత్తువేసింది. ఇప్పుడు అనూహ్యంగా గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ అదే పాత్ర పోషించాలని చూస్తోంది. సూయజ్ కాలువ ద్వారా మధ్యధరా సముద్రంలో ప్రవేశించిందేకు పర్షియా గల్ఫ్-ఎర్ర సముద్రాన్ని అనుసంధానం చేసే అల్ మండాబ్ జలసంధిని కూడా ఎమెన్ ద్వారా తన అదుపులోకి తెచ్చుకుంటామని హెచ్చరించింది. అదే జరిగితే ఐరోపా దేశాలను కూడా అది ఒక ఆట ఆడించగలదు. అమెరికా అనుసరిస్తున్న మొరటు సూత్రం ఒక్కటే. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారు. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రాంతమైన గాజాలో చేసింది అదే. ఆసుపత్రులు, స్కూళ్లు, సహాయ కేంద్రాలు వేటినీ వదలకుండా నాశనం చేసింది. 70 వేల మందికి పైగా పిల్లలు, మహిళలను చంపివేసింది. ఆ ప్రాంతాన్ని మరుభూమిగా మార్చింది. అయినప్పటికీ హమాస్‌గానీ, పాలస్తీనియన్లుగానీ ఇజ్రాయిల్‌కు లొంగలేదు. ఇప్పుడు ఇరాన్ కూడా యావత్ ప్రపంచానికి అదే సందేశమిచ్చింది. మీ మీద దాడి చేసే ఉద్దేశం మాకు లేదు, మీ అధినేత అయాతుల్లా అలీ ఖమేనిని పదవి నుంచి తొలగిస్తే మీకు రక్షణ కల్పిస్తాం, లేకపోతే దాడులు చేస్తాం అని మెరికా తొలి రోజుల్లో బెదిరించింది. ఆడపిల్లలు చదుకొనే పాఠశాల మీద అమెరికా విమానాలు బాంబులు వేసిన దుర్మార్గం గురించి తెలిసిందే. ఇప్పుడు వేరేగా మాట్లాడుతోంది. మార్చి 31, ఏప్రిల్ ఒకటవ తేదీల్లో చైనా సందర్శించాలని ట్రంప్ కార్యక్రమం నిర్ణయించుకున్నాడు. చైనా పర్యటన ఎప్పుడో ఖరారైంది గనుక ఈలోగా ఇరాన్‌ను దెబ్బ తీసి దాన్నే చైనా ముందు ప్రదర్శించాలన్న దుష్టాలోచనతోనే ఫిబ్రవరి 28న దాడులు ప్రారంభించినట్లు చెప్పవచ్చు. అయితే ట్రంప్‌నకు ఇరాన్ చుక్కలు చూపించింది. దాంతో మార్చి నెలాఖరులో చైనా పర్యటనను వాయిదా వేసుకున్నాడు. మే నెల 14, 15 తేదీల్లో వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. జరుగుతున్న పరిణామాలను బట్టి అది కూడా జరుగుతుందా వాయిదా పడుతుందా అన్నది చూడాల్సి ఉంది. తొందరేం లేదు, ఎప్పుడు రావాలంటే అప్పుడు రావచ్చన్నట్లుగా చైనా ఉంది. ఏ ముఖం పెట్టుకొని ట్రంప్ వెళతాడో చూద్దాం. చివరిగా చెప్పుకుంటున్నా అతి ముఖ్యమైన అంశం ఒకటుంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అది వియత్నాం, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, సిరియా, లిబియా ఏ దేశం మీద దాడి చేసినా అమెరికాకు మిత్ర దేశాలు సహకరించాయి. తొలిసారిగా ఇరాన్‌పై దాడికి ముఖం చాటేశాయి. అది తమ యుద్ధం కాదని ప్రకటించాయి. కొంత మంది వర్ణించినట్లు ఇప్పుడు జరుగుతున్న దాడి కేవలం ఇరాన్ మీద కాదు, దానికి మద్దతు ఇస్తున్న రష్యా, చైనాల మీద అన్నది నిజమేనా!

## వాడపల్లిలో వైభవంగా ఉత్సవాలు

### భారీగా హాజరైన భక్తులు



కోనసీమ,ఏప్రిల్2 : కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం నిర్వహించారు. భక్తి, శ్రద్ధల సమ్మేళనంగా తెప్పోత్సవం కొనసాగింది. విశేష పూజలతో పాటు, కన్నుల పండుగగా జరిగింది. వేకువజామున ఆలయ అర్చకుల మేల్కొలుపుతో ప్రారంభమైన ఈ మహోత్సవంలో గౌతమి గోదావరి పవిత్ర జలాలను తెచ్చి స్వామివారికి సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం నిత్యార్చన, నిత్య హోమాలు, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం వంటి వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారు అమ్మవార్లకు విశేష పూజారి కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతులతో నిండిపోయింది. సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఎంతగానో అలరించాయి. విశేష సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రధాన హోమం అనంతరం స్వామివారిని సన్నాయి మేళాల నడుమ రాత్రి గౌతమి గోదావరి తీరం వైపు తీసుకెళ్లి, అంగరంగ వైభవంగా తెప్పోత్సవాన్ని నిర్వహించారు. నది మధ్యలో సాగిన ఈ తెపోత్సవం భక్తులకు కనుల విందుగా మారి, హృదయాలను భక్తి పరవశంలో ముంచెత్తింది. స్వామివారి కోసం ప్రత్యేకంగా విద్యుత్ పూల అలంకరణలతో రూపొందించిన తెప్ప అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. గోదారమ్మ ఒడిలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం అందరిని మంత్రముగ్ధులను చేసింది. ఈ పవిత్ర వేడుకల్లో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా విశేషమైన ఏర్పాట్లు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు నృత్య ప్రదర్శనలు, కళా ప్రదర్శనలు, కోలాటాలు నిర్వహించారు. సమీప ప్రాంతాలు నుంచే కాకుండా సుధీర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు ఈ కార్యక్రమాలు ఆనందాన్ని, ఉల్లాసాన్ని నింపడంతో పాటు భక్తిని కూడా పెంపొందించాయి. భక్తుల గోవింద నామస్మరణల మధ్య సాగిన ఈ మహోత్సవం కోనసీమ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలిపింది.

# తెలంగాణలో క్యాన్సర్ డేంజర్ బెల్స్



### కొత్తగా 46,762 క్యాన్సర్ కేసులు

హైదరాబాద్, : తెలంగాణలో క్యాన్సర్ మహమ్మారి చాపకింద నీరులా వేగంగా విస్తరిస్తోంది. క్యాన్సర్ బాధితుల సంఖ్య ప్రతి ఏడాది వేలల్లో పెరుగుతున్నా.. ముందస్తు పరీక్షల పట్ల ప్రజల్లో అవగాహన లోపించడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై తెలంగాణ క్యాన్సర్ బర్డెన్ ప్రొఫైల్-2026 పేరుతో ఐసీఎంఆర్ విడుదల చేసిన తాజా నివేదికగ్భ్రాంతికర నిజాలను వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయని నివేదికలో తెలిపారు. ప్రతి ఏటా వేల సంఖ్యలో కొత్త కేసులు వెలుగుచూస్తున్నాయని.. అయినా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించే స్క్రీనింగ్ పరీక్షల రేటు మాత్రం అత్యల్పంగా ఉందన్నారు. నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో 30-49 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళల్లో కనీసం 4 శాతం మంది కూడా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం లేదు. ఇది వేలాది మంది ప్రాణాలను ముప్పులోకి నెడుతోంది.మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ రేటు కేవలం 0.3 శాతంగానే ఉందని నివేదిక వెల్లడించింది. అలాగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు 3.3 శాతం, నోటి క్యాన్సర్ పరీక్షలు 2.5 శాతం మంది మహిళలు మాత్రమే చేయించుకుంటున్నారు. పురుషుల్లో కేవలం 2.6 శాతం మంది మాత్రమే నోటి క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారు. నిమ్స్‌తో పాటు మరో 10 హాస్పిటల్స్ నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. 2026 చివరి నాటికి తెలంగాణలో కొత్తగా 46,762 క్యాన్సర్ కేసులు నమోదవుతాయని అంచనా. ఇందులో పురుషులు 21,252 మంది కాగా.. మహిళలు 25,510 మంది ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య ఏడాదికి 47,314కు చేరుతుందని అంచనా వేస్తున్నారు.ఇక గడిచిన దశాబ్ద కాలంలో క్యాన్సర్ కేసుల సంఖ్య 30 శాతం పెరిగింది. 2015లో 40,177గా ఉన్న కేసులు, 2024 నాటికి 52,334 కు చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మహిళల్లో ప్రతి లక్ష మంది జనాభాకు 183.8 మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. పురుషుల్లో ఈ రేటు 141.9గా ఉంది. రాష్ట్రంలో నమోదవుతున్న క్యాన్సర్లలో పొగాకు వాడకం వల్ల వచ్చే కేసులే ఎక్కువగా ఉన్నాయి. పురుషుల్లో 58.8 శాతం, మహిళల్లో 29.7 శాతం క్యాన్సర్లు పొగాకు వల్లే వస్తున్నాయి. ముఖ్యంగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, గొంతు క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. దీనికి తోడు ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు కూడా క్యాన్సర్ ముప్పును పెంచుతున్నాయి. మహిళల్లో పీసీఓడీ, హార్మోన్ల సమస్యలు కూడా క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి.ముందస్తు పరీక్షలు చేయించుకోకపోవడం వల్లే చాలా మంది రోగులు వ్యాధి ముదిరిన తర్వాత ఆస్పత్రులకు వస్తున్నారని ఓజెఏ క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్లు పేర్కొంటున్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేసే అవకాశం ఉన్నప్పటికీ.. ఆలస్యం కావటం వల్ల చికిత్స క్లిష్టతరంగా మారుతోందన్నారు. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా స్క్రీనింగ్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని.. పొగాకు నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## గ్రామ సభలో గందరగోళం.. బీఆర్ఎస్, కాంగ్రెస్ వాగ్వివాదం

తూప్రాన్: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై చేపట్టిన గ్రామ సభ గందరగోళానికి దారితీసింది. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో స్పెషల్ అధికారి ఇంచార్జి ఎంపిడిఓ కృష్ణ మూర్తి సర్పంచ్ కందల రాజనర్సింహ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామ సభలో పథకాలను ఈవో ప్రజలకు వివరిస్తుండగా బీఆర్ఎస్ నాయకులు నిలదీయడంతో కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. ఇఫ్తర్ తోఫా ఇవ్వలేదని ముస్లిం మహిళలు ఆందోళన చేశారు. దీంతో గ్రామ సభ మొత్తం గందరగోళానికి దారితీసింది. రెండు వర్గాలు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. అనంతరం ఎంపిడిఓ కృష్ణ మూర్తి అందరినీ సమాధానం చెప్తాం గ్రామ సభ సజావుగా జరగడానికి సహకరించాలని కోరారు.



# జనసేవు వైపు నేతల చూపు

## జనసేన

కాకినాడ, : దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పెంపుతో ఏపీ పొలిటికల్స్‌లో సరికొత్త డిస్కషన్ స్టార్ట్ అయింది. ఏపీలో 175గా ఉన్న అసెంబ్లీ స్థానాలు 269కి, 25 లోక్‌సభ సీట్లు 38కి పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. సీట్ల పెరుగుదల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే ఎక్కువ ప్లస్ పాయింట్ అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.175 సీట్లలో 164 సాధించిన కూటమి, 269 సీట్లలో 135 మ్యాజిక్ ఫిగర్‌ను ఈజీగా చేరుకోవచ్చని అంచనాలు ఉన్నాయి. అధికారంలో ఉన్న కూటమి పునర్విభజనను తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంది. అయితే ఆల్రెడీ 175 నియోజకవర్గాల్లోనే బలమైన అభ్యర్థులు లేక ఇబ్బంది పడుతున్న వైసీపీకి..పెరిగే సీట్లలో క్యాండిడేట్స్‌ను నిలబెట్టడం, గెలుపు గుర్రాలను ఎంపిక చేయడం పెద్ద సవాల్‌గా మారే ఛాన్స్ ఉందంటున్నారు. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపు ఫ్యాన్ పార్టీకి ఇబ్బందికర సిచ్యువేషన్స్‌ను క్రియేట్ చేయొచ్చన్న చర్చ జరుగుతోంది.టీడీపీలో టికెట్ ఆశావహులు ఎక్కుగానే ఉంటారు. గత ఎన్నికల్లోనే తమకు సీటు ఇవ్వలేదని అలిగిన నేతలు..సీటు త్యాగం చేసి పదవులు దక్కట్లేదన్న అసంతృప్తిలో ఉన్న నేతలు చాలామందే ఉన్నారు. అలాంటి వారికి సీట్ల పెంపుతో అవకాశం దక్కడం పక్కా. కూటమిగా వెళ్లినా సొంత పార్టీ నేతలకు టికెట్ల కేటాయింపు చంద్రబాబుకు ఈజీ కానుంది. గత ఎన్నికలప్పుడు సీట్ల పంపకాల కోసం పడ్డ ఇబ్బందులు ఈసారి ఉండకపోవచ్చు.ఇక 21 అసెంబ్లీ స్థానాలు, 2 ఎంపీ సీట్లలో పోటీ చేసి గెలిచి వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించిన జనసేన వచ్చే ఎన్నికల కోసం ఇప్పటినుంచే సమాయత్తం అవుతోంది. యువతకు ఎక్కువ అవకాశాలు ఇచ్చే యోచనలో పవన్ కల్యాణ్ ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అసెంబ్లీ, లోక్ సభ సీట్ల పెంపు జనసైనికులకు వరంగా మారే అవకాశంఉంది. అయితేటీడీపీతో పొత్తులో ఉండటంతో తమకు రాజకీయ అవకాశాలు దక్కవేమోనన్న ఆందోళనలో ఉన్న పలువురు జనసేన నేతలకు గతంలోనే క్లారిటీ ఇచ్చారు పవన్.రిజర్వేషన్లు, స్థానిక పరిస్థితులు, పొత్తులను బట్టి టికెట్లు వస్తాయి. సీటు రాని వారికి నామినేటెడ్ పోస్టులు దక్కుతాయంటూ భరోసా ఇచ్చారు. అలా ఆయన మాటే శాసనంగా జనసేన కోసం పని చేస్తున్న వారికి సీట్లసంఖ్య పెంపు స్వీట్ న్యూస్‌గా మారనుంది. గత ఎన్నికల్లో జనసేన నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన 21 మందిలో ఎక్కువ మంది కొత్త వాళ్లే. పైగా కార్యకర్త స్థాయి నేతలకు టికెట్ ఇచ్చి చట్టసభల్లో అడుగు పెట్టే అవకాశం కల్పించారు పవన్. రాబోయే ఎన్నికల్లో మరింత మంది యువ నేతలకు అవకాశాలు దక్కనున్నాయి. పైగా మహిళ రిజర్వేషన్లు అమల్లోకి వస్తే వీర మహిళలకు సీట్లు దక్కనున్నాయి. దీంతో ఇప్పుడు అందరి చూపు జనసేన వైపు అన్నట్లుగా మారిపోయింది సీన్.జనసేనలోకి వెళ్తే సీటు గ్యారెంటీ. ఇప్పుడీ ఈక్వేషన్ ఏపీ పాలిటిక్స్‌లో తెగ ఇంట్రెస్టింగ్‌గా మారింది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశపడుతున్నవారికి జనసేన బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తోందట. ఈసారి పొత్తులో భాగంగా జనసేనకు గతంలో కంటే డబుల్, ట్రిపుల్ సీట్లు దక్కుతాయని ఆశావహులు లెక్కలేసుకుంటున్నారు. ఏపీ అసెంబ్లీలో సీట్ల సంఖ్య 269కి చేరితే జనసేనకు యాభై నుంచి డెబ్బై ఎమ్మెల్యే సీట్లు దక్కుతాయనేది కొందరి అంచనా. ఇక లోక్‌సభ సీట్లు 38కి పెరిగితే..జనసేన పది దాకా లోక్‌సభ సీట్లలోపోటీ చేసే ఛాన్స్ ఉందనేది ఇంకో లెక్క. ఈ క్రమంలో ఇప్పటి నుంచే జనసేనలో చేరి జనంలోనూ, పవన్ దృష్టిలోనూ పడితే టికెట్ తమకే దక్కుతుందని..వన్స్ పార్టీ బీఫామ్ దక్కితే గెలుపు ఈజీ అవుతుందని మాస్టర్ ప్లాన్ వేసుకుంటున్నారట పలువురు నేతలు.జనసేన తలుపులు తెరిస్తే చాలు గాజు గ్లాస్‌లో టీ తాగేందుకు తెగ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారట పలువురు లీడర్లు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన నేతలు..జనసేనవైపు చూస్తున్నారట. అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల పెంపు జనసైనికులకు, జనసేన కు నయా జోష్ తెస్తుందన్న టాక్ అయితే బలంగా వినిపిస్తోంది.

## రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

హైదరాబాద్,ఏప్రిల్2 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు దుర్మరణం చెందారు. ఈ విషాదకర సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం నర్సాపూర్‌కు చెందిన ఓ కుటుంబం కారులో వెళుతుండగా అదుపు తప్పి చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు సోదరులు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఐదుగురు గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## వేసవిలో ఎండ వేడి, ఎండ దెబ్బను తప్పించుకోవాలంటే..

# జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి..

వేసవి కాలం మొదలవడంతో వడగాలుల తీవ్రత పెరిగి శరీరంపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువవుతున్నాయి. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతలు వరుసగా కొన్ని రోజులు కొనసాగితే శరీరం తన అంతర్గత ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడానికి ఎక్కువగా శ్రమిస్తుంది. చెమట పట్టడం, రక్త ప్రసరణ పెరగడం ద్వారా శరీరం చల్లబడేందుకు ప్రయత్నిస్తుంది. అయితే రోజువారీ అలవాట్లలో కొన్ని పొరపాట్లు ఈ ప్రక్రియను మరింత కష్టతరం చేస్తాయి. ఒక అధ్యయనం ప్రకారం వడగాలులు ముఖ్యంగా వృద్ధులు, పిల్లల్లో మరణాల ముప్పును పెంచడంతో పాటు ఆందోళన, నిరాశ వంటి మానసిక సమస్యలకు కూడా కారణమవుతాయి. కాబట్టి హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్ వంటి సమస్యలను నివారించాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు.

మధ్యాహ్నం తరువాత బయటకు వద్దు..: వడగాలుల సమయంలో ఎక్కువగా జరిగే పొరపాటు నీరు తక్కువగా తాగడం. చెమట ద్వారా శరీరం ఎక్కువ నీటిని కోల్పోతుంది. ఈ నీటిని భర్తీ చేయకపోతే డీహైడ్రేషన్ సమస్య వస్తుంది. దీని వల్ల తల తిరగడం, తలనొప్పి, అలసట, దృష్టి లోపం వంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి రోజంతా తరచుగా నీరు తాగడం అవసరం. అలాగే మధ్యాహ్నం, ఆ తరువాతి గంటలు రోజులో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉండే సమయం. ఈ సమయంలో ఎక్కువసేపు బయట గడపడం హీట్ సంబంధిత సమస్యల ముప్పును పెంచుతుంది. వీలైనంత వరకు ఈ సమయంలో బయటకు వెళ్లకుండా, చల్లని ప్రదేశాల్లో ఉండటం మంచిది. అదే విధంగా దుస్తులు కూడా శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. బిగుతైన దుస్తులు, గాఢ రంగులు వేడిని ఎక్కువగా నిల్వ చేస్తాయి. దీంతో చర్మానికి గాలి సరిగా అందదు. తేలికపాటి, లూజ్‌గా ఉండే, లైట్ కలర్ దుస్తులు ధరించడం ద్వారా శరీరం సులభంగా చల్లబడుతుంది.

ఆహారం మానేయకూడదు..: అంతేకాకుండా చెమట, కండరాల నొప్పులు, వికారం, తల తిరగడం వంటి లక్షణాలు శరీరం వేడిని తట్టుకోలేకపోతున్న సంకేతాలు. ఈ లక్షణాలను చాలా మంది నిర్లక్ష్యం చేస్తారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే పరిస్థితి తీవ్రమై హీట్ స్ట్రోక్‌కు దారితీయవచ్చు. కనుక ఈ లక్షణాలను గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. అలాగే కాఫీ, మద్యం వంటి పానీయాలు శరీరంలో నీటి నష్టాన్ని పెంచుతాయి. దీంతో డీహైడ్రేషన్ మరింత పెరుగుతుంది. వీటి బదులు నీరు, తాజా జ్యూసులు, ఎలక్ట్రోలైట్ పానీయాలు తీసుకోవడం మంచిది. ఎండలో ఆకలి తగ్గడం సహజం. కానీ పూర్తిగా ఆహారం మానేయడం సరైంది కాదు. శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోతే శక్తి తగ్గిపోతుంది. పండ్లు, కూరగాయలు, నీరు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వంటివి చేయాలి. ఎక్కువ వేడి ఉన్న సమయంలో కఠినమైన వ్యాయామం లేదా శారీరక శ్రమ చేయడం శరీర ఉష్ణోగ్రతను వేగంగా పెంచుతుంది. అవసరమైతే ఉదయం లేదా సాయంత్రం సమయంలో మాత్రమే వ్యాయామం చేయడం సురక్షితమని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వేడికి ఎక్కువగా ప్రభావితమవుతారు. వీరిని వేడి ప్రదేశాల్లో ఉంచడం, నీరు తాగించకపోవడం ప్రమాదకరం. వీరు ఎప్పుడూ చల్లని ప్రదేశాల్లో ఉండేలా చూసుకోవాలి.

వడగాలులతో తీవ్రమైన ముప్పు..: వడగాలులు ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించవచ్చు. అయితే సాధారణ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ ముప్పును తగ్గించవచ్చు. తగినంత నీరు తాగడం, ఎండలో బయటకు వెళ్లడాన్ని తగ్గించడం, సరైన దుస్తులు ధరించడం, శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. రోజువారీ అలవాట్లలో చిన్న మార్పులు చేసుకుంటే, అధిక ఉష్ణోగ్రతలను శరీరం సులభంగా తట్టుకోగలదు. జీవనశైలిలో ఈ మార్పులు చేసుకోవడం వల్ల హీట్ స్ట్రోక్ కు గురి కాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చునని వైద్యులు తెలియజేస్తున్నారు.

## మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



న్యూఢిల్లీ,ఏప్రిల్2 : పసిడి ప్రియులకు శుభవార్త. పశ్చిమాసియా యుద్ధం కారణంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉంటాయోనని భయాందోళన చెందుతున్న తరుణంలో మగువలకు తీపికబురు. నిన్నటి రోజున భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. కొన్ని గంటల వ్యవధిలోనే భారీగా తగ్గాయి. పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో భారీ ఊరట లభించింది. తులం గోల్డ్‌పై రూ. 1,530 తగ్గగా.. కిలో వెండిపై రూ. 5,000 తగ్గింది. తులం గోల్డ్‌పై రూ. 1,530 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 1,51,420 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ. 1,400 తగ్గడంతో రూ. 1,38,800 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ. 1,440 తగ్గడంతో రూ. 1,13,570 దగ్గర ట్రేడ్ అవుతోంది. సిల్వర్ ధర కూడా భారీ దిగొచ్చింది. గురువారం కిలో వెండిపై ఏకంగా రూ. 5,000 తగ్గింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ. 2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ. 2,55,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, బెంగళూరులో మాత్రం కిలో వెండి ధర రూ. 2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది.

## ముఖ్యమంత్రి సభ పై జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశం



ఆదిలాబాద్, ఏప్రిల్ : 02 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) : ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామనికి ఈనెల 6 తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో కార్యక్రమ వివరాలపై జిల్లా డిసిసి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ తో కలిసి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ జాదవ్ మాట్లాడుతూ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి వర్యులు బట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి , జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు రానున్న సందర్భంలో సభా స్థల ఏర్పాట్లను జిల్లా ప్రభుత్వ అధికారులతో ఇప్పటికే పరిశీలించడం జరిగిందన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో మాజి ఎంపీ సోయం బాపూరావ్ , మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్ , మాజీ టీపిసిసి ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి , డిసిసి కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు

# అడకత్తెరలో పోక చెక్కలో అమెరికా

న్యూఢిల్లీ, : ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందని ఆరోపిస్తూ డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై యుద్ధం ప్రకటించాడు. కానీ ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడం అమెరికా దీర్ఘకాలిక లక్ష్యం. వివిధ జాతి, మత వర్గాలను రెచ్చగొట్టి, అంతర్గత అస్థిరత సృష్టించాలని వాషింగ్టన్ ఎత్తులు వేసింది. కానీ, ఆ ప్రణాళికలు వికటించి, అమెరికా తాను సృష్టించిన సంక్షోభంలో తానే చిక్కుకుపోయింది. ఇప్పుడు ముందుకు సాగలేక.. వెనక్కి రాకపోలేక నానా తంటాలు పడుతోంది. ఇరాన్ జనాభాలో సుమారు 10 శాతం ఉండే కుర్దులు, ఇస్లామిక్ పాలనకు వ్యతిరేకంగా దశాబ్దాలుగా పోరాడుతున్నారు. సిరియాలో ఐఎస్ఐఎస్‌ను ఎదుర్కొనేందుకు అమెరికా సైన్యమే వీరికి శిక్షణ ఇచ్చింది. ఆ అనుభవంతో కుర్దిష్ పెష్మెర్గా (మృత్యుదళం) ఇరాన్ సరిహద్దులు దాటి భూతల యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉంది. తుర్కియే, ఇరాన్ మధ్య నలిగిపోయిన కుర్దులు, ఈ దాడుల్లో పాల్గొంటే తమకు భారీ ప్రతిఫలం దక్కుతుందని ఆశించింది. కుర్దిష్ గ్రూపులు ఇరాన్‌పై పోరాటానికి సిద్ధమయ్యాయి. ఇరాక్‌లో ఉన్న కుర్దిష్ దళాలు ఇరాన్‌లోకి చొరబడేందుకు ఆయుధ విభాగాలను సిద్ధం చేస్తున్నాయి. పాకిస్తాన్‌పై దీర్ఘకాలిక పోరాటం చేస్తున్న బలూచ్‌లను కూడా అమెరికా వాడుకోవాలని చూస్తోంది. గతంలో 'సీపెక్' ప్రాజెక్టును వ్యతిరేకించి, చైనా ఇంజినీర్లపై దాడులు చేసిన బలూచ్‌లు, అమెరికా మద్దతును ఆశిస్తున్నారు. కానీ, బలూచ్‌లకు హామీ ఇస్తే పాకిస్తాన్‌ను దూరం చేసుకోవాల్సి వస్తుంది. ఇజ్రాయెల్‌కు మాత్రం ఈ సమస్య లేదు, అయితే భూతల యుద్ధం ప్రారంభమైతే మొత్తం ప్రాంతం గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉంది. ఇరాన్ విషయంలో అమెరికా ప్రాథమికంగా భావించిన దానికి విరుద్ధంగా పరిస్థితులు మారాయి.. సుప్రీంలీడర్ మరణంతో ఇరాన్ విచ్ఛిన్నమవుతుందని, అసంతృప్తితో ఉన్న ప్రజలు వీధుల్లోకి వస్తారని, కుర్దులు, బలూచ్‌లు తిరగబడితే సులభంగా గెలుస్తామని అమెరికా అంచనా వేసింది. కానీ ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. యుద్ధం కారణంగా ప్రజల్లో ఐక్యత పెరిగింది. అంచనాలు తలకిందులు కావడంతో అమెరికా ఇప్పుడు తక్కువ నష్టంతో బయటపడలేని సంకట స్థితిలో ఉంది. యుద్ధానికి ముందు ప్రజాదరణ కోల్పోయిన ఇరాన్ ప్రభుత్వం యుద్ధం మొదలైన తర్వాత జాతీయ భావోద్వేగాన్ని రెచ్చగొట్టి ప్రజల మద్దతును సంపాదించుకుంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) స్థానిక మత కేంద్రాల నుంచి సైనికులను చేర్చుకుంటూ, భూభాగంపై గట్టి పట్టును కొనసాగిస్తోంది. అమెరికా నిఘా నివేదిక కూడా ఇరాన్ ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి లేదని నిర్ధారించింది. అమెరికా ఇరాన్‌లో చేస్తున్న పొరపాటు, నాడు అఫ్గానిస్తాన్‌లోనూ చేసింది. అఫ్గాన్‌లో హజారాలను శిక్షణ ఇచ్చి తాలిబన్‌లకు వ్యతిరేకంగా ఉసిగొల్పింది. వాళ్లు 20 ఏళ్లు పరస్పరం దాడులు చేసుకున్నారు. చివరికి అమెరికా వెనుదిరిగి, తాలిబన్‌లతోనే ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఇరాన్‌లో అమెరికా పరిస్థితి ఇలాగే కనిపిస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ తమ సొంత సైన్యాలను



పంపించాలనుకున్నా, నిపుణులు దీనిని వ్యూహాత్మకంగా తప్పుడు ఎత్తుగడగా భావిస్తున్నారు. ఇరాన్ సంక్లిష్ట పర్వత, ఎడారి భౌగోళిక పరిస్థితులు, స్థానిక జనాభా మద్దతు లేకపోవడం, ఐఆర్‌జీసీ బలమైన నెట్‌వర్క్ కలిగి ఉండడం, హోర్మూజ్ జలసంధి మూసివేత ముప్పు అమెరికాను భయపెడుతున్నాయి. మొత్తంగా ఇప్పుడు అమెరికా ముందుకూ కదల్లేక, వెనక్కి వెళ్లలేని పరిస్థితిలో ఉంది. ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తే, ప్రాంతీయ యుద్ధం తప్పదు. వెనుదిరిగితే, అంతర్జాతీయ ప్రతిష్ట దెబ్బతింటుంది. ఇప్పటికే ఆయిల్ ధరలు పెరిగి, అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక భేదాలు తలెత్తుతున్నాయి. తప్పుడు అంచనాలపై నిర్మించిన వ్యూహం ఇలా కుప్పకూలింది.

# తెలుగు రాష్ట్రాల్లో పవర్ ఫుల్ లీడర్స్



హైదరాబాద్,: తెలుగు రాష్ట్రాల నాయకులు మరోసారి తమ సత్తా చాటుకున్నారు. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించారు. ప్రఖ్యాత జాతీయ దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తాజాగా ప్రకటించిన ' 100': 2026 పేరుతో అత్యంత శక్తివంతమైన భారతీయుల జాబితాను ప్రకటించింది. అందులో తెలుగు ప్రముఖులకు చోటు దక్కింది. దేశ గమనాన్ని శాసించగల వందమంది ప్రముఖులతో రూపొందించిన ఈ జాబితాలో తెలుగు నేతలకు అగ్రతాంబూలం దక్కడం విశేషం. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ జాబితాలో ఉన్నారు. అందరికంటే మెరుగైన స్థితిలో ఏపీ సీఎం చంద్రబాబు ఉండడం విశేషం. దేశంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తులను ఈ జాబితాలో చేర్చారు. అందులో ఏపీ సీఎం చంద్రబాబు 13వ స్థానంలో నిలవడం విశేషం. అత్యంత శక్తివంతమైన తెలుగు నాయకుడిగా ఆయన తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించడం, ఏపీ పునర్నిర్మాణంలో ఆయన చూపుతున్న చొరవ జాతీయ స్థాయిలో సైతం గుర్తింపు పొందింది. ఇక తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారారు సీఎం రేవంత్ రెడ్డి. ఆయన ఈ జాబితాలో 25వ స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీ తర్వాత అత్యంత ప్రభావశీలుడైన నేతగా రేవంత్ గుర్తింపు సాధించారు. మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ వంటి సీనియర్లను వెనక్కి నెట్టి రేవంత్ రెడ్డి ఈ జాబితాలో ముందంజలో ఉండడం విశేషం. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్68వ స్థానంలో నిలిచారు. మరోసారి తన గ్లామర్ ను నిరూపించుకున్నారు. జాతీయస్థాయిలో మంచి నాయకుడిగా గుర్తింపు పొందారు. కేంద్ర మంత్రి గింజరాపు రామ్మోహన్ నాయుడు సైతం 90 స్థానంలో నిలిచారు. కేంద్ర క్యాబినెట్లో తెలుగు రాష్ట్రాల నుంచి యువనేతగా ఎంపికైన ఆయన మంచి వాగ్ధాటితో ముందుకు సాగుతున్నారు. అయితే ఏపీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి ఒక్కరంటే ఒక్క నేతకు కూడా ఈ జాబితాలో స్థానం దక్కకపోవడం విశేషం. ఒకప్పుడు అద్భుత విజయంతో జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఇప్పుడు అదే స్థాయిలో ఓటమితో దారుణంగా దెబ్బతిన్నారు రాజకీయంగాను. అయితే ఒక జాతీయ పత్రిక ప్రకటించిన జాబితాలో ఆ రెండు పార్టీలకు ఇప్పుడు చోటు దక్కకపోవడం మాత్రం నిజంగా లోటు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే

భైంసా: ఏప్రిల్ 02 (తెలంగాణ వాణి ప్రతినిధి): హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని బొంద్రేడ్, భైంసా మండలంలోని మంజ్రి గ్రామాల్లో నిర్వహించిన హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన, కలశారోహణ మహోత్సవాల్లో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి ప్రార్థనలు చేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో భక్తి భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రజలు ఐక్యంగా కలిసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వైసీపీ క్రెడిట్ వార్




కడప, : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమై రెండేళ్లు అవుతోంది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో ఏ ప్రాజెక్టులు పూర్తయినా.. కొత్తవి వస్తున్నా.. అవి తమ క్రెడిట్ అన్నట్టు వ్యవహరిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తిరిగి క్రెడిట్ చోరీ అంటూ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతోంది. మొన్నటి వరకు జగన్మోహన్ రెడ్డి తాము చేసింది చెప్పుకోలేదని చెబుతున్నారు. ఇప్పుడు ఇదిగో మేం చేసాం అంటూ కొత్త పల్లవి అందుకుంటున్నారు. తాజాగా శ్రీకాకుళం జిల్లాలో ఛలో మూలపేట పోర్ట్ అంటూ సౌండ్ చేసింది వైసిపి. టెక్కలి నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న ఈ పోర్టు నిర్మాణం తుది దశకు చేరుకుంది. కానీ తమ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం జరిగింది అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్త వాదనను తెస్తోంది. తమ హయాంలోనే 70 శాతం పనులు జరిగాయని.. తమకి క్రెడిట్ ఇవ్వాలని కోరుతోంది. నిన్ననే ఆ పోర్టు వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి వైసిపి నాయకులు గట్టిగానే సౌండ్ చేశారు. 2023లో ఈ పోర్టు పనులను ప్రారంభించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అక్కడకు ఏడాది కాలంలోనే ఎన్నికలు వచ్చాయి. అయితే తాము దిగిపోయే నాటికి 70% పనులు పూర్తి చేశామని చెబుతోంది ఆ పార్టీ. ఏడాది కాలంలో 70 శాతం పనులు చేస్తే.. ఈ రెండేళ్ల కాలంలో 30% పనులు జరిగాయా అనే ప్రశ్న వినిపిస్తోంది. పైగా వైసీపీ హయాంకంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే పనులు వేగవంతం అయ్యాయన్న వాదన ఉంది. కానీ వైసీపీ ఆలోచన అదికాదు. ఈ పోర్టు నిర్మాణంలో తమ పార్టీ ముద్ర ఉండాలని బలంగా కోరుకుంటుంది. పైగా అదనపు భూసేకరణ అనే అంశం తెరపైకి వస్తే దానిని పట్టుకొని పోరాటం చేయాలని చూస్తోంది. తద్వారా టెక్కలి నియోజకవర్గంలో పాటు శ్రీకాకుళం జిల్లాలో పట్టు పెంచుకోవాలని భావిస్తోంది. అందుకే ఉత్తరాంధ్ర నుంచి వైసిపి నేతలంతా ఈ కార్యక్రమానికి కదలి వచ్చారు. ప్రస్తుతం మూలపేట పోర్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దాదాపుతుది దశకు చేరుకుంటున్నాయి. ఈ ఏడాది నవంబర్ నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసి పోర్టు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే నెలలో ట్రయల్ రన్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ సమాచారంతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టు పూర్తయ్యాక క్రెడిట్ కోసం ప్రయత్నిస్తుంటారు. కానీ ప్రాజెక్టు ప్రారంభానికి ముందే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఇది మా వల్లే సాధ్యం అయింది అని ప్రజల్లోకి సంకేతాలు పంపించగలిగింది. అయితే దీనిని కూటమి ధీటుగానే బదులిస్తోంది. ఈ క్రెడిట్ ఆరాటాన్ని ప్రజలు పట్టించుకోరని తేల్చి చెబుతోంది.

## ప్రజా పాలన - ప్రగతి నివేదిక కార్యక్రమం ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరు

నిర్మల్, ఏప్రిల్:02(తెలంగాణ వాణి ప్రతినిధి): ప్రజాపాలన – ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బుధవార్ పేట్‌లో నిర్వహించిన వార్డు సభకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి ఘనంగా ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలు సంక్షేమ పథకాల లబ్దిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య, వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పథకాలు దేశానికే రోల్ మోడల్

- అందరికి అండగా ప్రజా ప్రభుత్వం
- త్వరలో ఇందిరమ్మ భీమా పథకం అమలు చేస్తాం
- ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్




వేములవాడ,ఏప్రిల్ 02 (తెలంగాణ వాణి) : ప్రజా ప్రభుత్వం అందరికి అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా గురువారం గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించగా, వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో గ్రామ సభ,వేములవాడ పట్టణంలోనిహో25హోవార్డులో వార్డు సభ లు నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. వ్యవసాయ యాంత్రీకరణ కింద పలు యంత్రాలను ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. చెక్కపల్లి గ్రామం, వేములవాడ పట్టణంలోని 25హోవార్డులో ఆరు గ్యారంటీల అమలు, వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలు చదివి వినిపించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు రుణ మాఫీ, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకే గ్యాస్ సిలిండర్లు, ఇతర ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్న వారు తమకు జరుగుతున్న మేలు వివరించారు. వివిధ పథకాల ద్వారా ఆదా అవుతున్న డబ్బులను తమ పిల్లల ఉన్నత చదువులకు, పొదుపు వైపు మళ్ళిస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ పథకాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అండగా ఉన్నారని తెలిపారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలిచిందని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కోటి 15హోలక్షల మంది రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు త్వరలో 5 లక్షల జీవిత బీమా కల్పించనున్నామని పేర్కొన్నారు. రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డు ఇస్తున్నామని వివరించారు. రూ. 14,600 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలో రేషన్ కార్డు దారులకు సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇటీవల సన్న బియ్యం పంపిణీ చేసి సంవత్సరం అయిన సందర్భంగాహోఅసెంబ్లీ లోహోముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు సన్నం బియ్యంతో భోజనం చేశారని గుర్తు చేశారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రకియ అని ప్రకటించారు. ఎప్పుడు దరఖాస్తు చేసుకున్న నూతన రేషన్ కార్డు,కార్డులో మార్పులు చేర్పులకు అవకాశం ఉందని చెప్పారు. 200హోయూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామని తెలిపారు. దేశంలో ఆంజనేయ స్వామి గుడి లేని ఊరు లేదు.. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. చెక్కపల్లి - వట్టెంల రోడ్డు నిర్మాణానికి అదనంగా నిధులు మంజూరు చేసి పనులు త్వరలోనే ప్రారంభం చేస్తామని వెల్లడించారు. రూ.హో6హోకోట్లతో భీమేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేశామని వివరించారు. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. వేములవాడ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తెచ్చి వేగంగా విస్తరిస్తున్న పట్టణానికి అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని విప్ తెలిపారు. రాజన్న ఆలయం నుంచి తిప్పాపూర్ బస్ స్టాండ్ వరకు రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. కోరుట్ల బస్టాండ్ నుంచి చెక్కపల్లి బస్టాండ్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని గుర్తు చేసారు. మహాలక్ష్మి కింద ఆర్టీసీ బస్సులో నిన్నటి వరకు మహిళలు ఉచిత బస్సు ప్రయాణాలు చేసి రూ. 10 వేల కోట్లు ఆదా చేశారని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయడంలో ప్రథమ స్థానంలో ఉన్నాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాలో 1303 ఇండ్లు పూర్తి చేసి రాష్ట్రంలోనే రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రథమ స్థానంలో ఉందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని, జూన్ 12 వ తేదీ వరకు 10 శాఖల ఆద్వర్యంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే సర్పంచులు, మున్సిపల్ చైర్మెన్లు, వార్డ్ సభ్యులకు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో అవగాహన కల్పించామని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉన్నామని వెల్లడించారు. రైతు రుణమాఫీ కింద 46,492 మంది రైతులకు రూ. 370 కోట్లు చేసిందని వెల్లడించారు. నూతన రేషన్ కార్డులు 21,829 మంజూరు చేశామని తెలిపారు. 1,03,537 కుటుంబాలకు ఇప్పటిదాకా రూ. 500 లకే 1,76,947 సిలిండర్లు పంపిణీ చేసామని గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్,హోసన్న రకం వరికి బోనస్,హోచేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్,హోఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ,హోవడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిందని తెలిపారు. రాష్ట్రంలో త్వరలో అల్పాహార పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవితం బీమా పథకం, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్మీడియట్ వరకు విస్తరణ, ఇంటర్మీడియట్ చదివే దివ్యాంగ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు అందజేయనున్నదని వివరించారు. జిల్లాలోని పలు రెసిడెన్షియల్ విద్యాలయాలకు ఇటీవల గీజర్లు అందించామని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలకు, తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టళ్లకు 20 ఫ్రీజర్లు పంపిణీ చేశామని గుర్తు చేశారు. దీంతో విద్యార్థులకు స్వచ్ఛమైన కూరగాయలు, పండ్లు, పాలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయని వివరించారు. అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాలకు తాను, అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు, మండల అధికారులు తనిఖీ చేస్తున్నారని, విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యత, ఆవరణ పరిశీలిస్తున్నారని తెలిపారు.

ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం: వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో వంగ హారిక ఇందిరమ్మ ఇల్లు పూర్తి కాగా, గృహ ప్రవేశ వేడుకకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్దిదారుకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,హోవైస్ చైర్మన్ నరాల శేఖర్,హోఆర్డీఓ రాధాభాయ్, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్,జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, చెక్కపెల్లి సర్పంచ్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు

### మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం సాధనకు కృషి చేయాలి



జగిత్యాల: ఏప్రిల్ 2 (తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో ముఖ్య అతిథులు జగిత్యాల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గొప్ప సామాజిక విప్లవకారుడిగా, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనేతగా నిలిచారని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ ప్రతి ఒక్కరికి మార్గదర్శకంగా ఉంటుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో కూడా అసమానతలు తొలగించి, ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించాలంటే మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. యువత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నుండి స్ఫూర్తి పొందుతూ సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ధైర్యం, నిబద్ధత, సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చేదిగా ఉండటంతో పాటు సమాజంలో మార్పు తీసుకురావడానికి దోహదపడిందని అన్నారు. ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సక్రమంగా వినియోగించుకుని ప్రజలు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. మహనీయుల ఆశయాలను అందరూ కలసికట్టుగా అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.సి అభివృద్ధి అధికారి జి. సునీత, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ హకీమ్,జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్, గౌడ సంఘ ప్రతినిధులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల ప్రతినిధులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



హుస్నాబాద్ ఏప్రిల్ 2 (తెలంగాణ వాణి ఆర్ సి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు పార్టీలకతీతంగా ఘనంగా నిర్వహించారు. దొరలు భూస్వాములు జమీందార్లు ఆగడాలను ఎదురొడ్డి నిలిచిన గొప్ప వీరుడు మొగల్ చక్రవర్తులను ఓడించి గోల్కొండ ను ఏలిన బహుజన చక్రవర్తి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజనులు కూడా రాజ్యాలు ఏలగలరు ప్రజలకు అనువైన పరిపాల అందించగలరని నిరూపించిన గొప్ప పోరాట సంస్కర్త చత్రపతి శివాజీకి సమకాలీకుడు అని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న నివసించినటువంటి సర్వాయిపేట మహ్మదాపూర్ గుట్టలను త్వరగా ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. పాపన్న గౌడ్ చరిత్రను అగ్రవర్ణాలు భావితరాలకు తెలియకుండా తొక్కి పెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాచపల్లి శ్రీనివాస్ ,ఉప సర్పంచ్ శ్రీధర్,సిపిఐ నాయకులు మాడిశెట్టి శ్రీధర్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాకాల శ్యా సుందర గౌడ్, వార్డు మెంబర్ నర్మెట కనకయ్య ,చొప్పరి శ్రీనివాస్,, బత్తిని ఎల్లయ్య, గౌడ్ బత్తిని రాజు, జోగిని శ్రీనివాస్ గౌడ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యశ్వంతరావు పేటలో గ్రామసభ కార్యక్రమం ఏర్పాటు

జగిత్యాల /బుగ్గారం :02 ఏప్రిల్ (తెలంగాణ వాణి విలేకరి ) జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావు పేట గ్రామంలో గురువారం రోజున ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ గ్రామ సభ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది.

ఈ కార్యక్రమంలో ప్రధాన సంక్షేమ పథకాల గురించి ఎంపీడీవో అధికారులు ఎమ్మార్వో అధికారులు పాల్గొని గ్రామంలో ఉన్నటువంటి ప్రజలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను గురించి వివరిస్తూ ప్రజలకు ఎలాంటి లోటుబాట్లు ఉన్న సరి చేస్తామంటూ ఇంతవరకు రైతు భరోసా ఇందిరమ్మ ఇండ్లు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ఉచిత కరెంటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కొత్త రేషన్ కార్డులు దివ్యాంగులకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోట రైస్డ్ వెహికల్స్, అందించడం జరిగింది. సన్నబడ్లకు 500 బోనస్ క్వింటలకు ఒక్కంటికి ఇలాంటి లాభదాయకమైనటువంటి ఎన్నో ఉచిత పథకాలు అందిస్తున్నది. ఈ మధ్యలో మహిళా సంఘాలకు కార్యక్రమ వేషాలకు




నూతన భవన నిర్మాణాలు కూడా అందిస్తున్నదంటూ తెలియజేశారు. గ్రామ ప్రజలకు గ్రామ అభివృద్ధి కొరకు ఏం ఏమి లోటుబాట్లు అవసరం ఉన్నా సంబంధిత అధికారులకు ఆన్లైన్లో అప్లై చేసుకుని లబ్ధి పొందాలంటూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉరిమెట్ల లక్ష్మి బుచ్చయ్య, ఉప సర్పంచ్ కోల శ్రీనివాస్ గ్రామ వార్డ్ మెంబర్స్ ఎంపీడీవో అధికారులు ఎమ్మార్వో అధికారులు అంగన్వాడి ఆశ వర్కర్లు వివో మేడం జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజపాలన ప్రగతి ప్రణాళికపై గ్రామసభ నిర్వహణ





తుంగతుర్తి: ఏప్రిల్ 02 (తెలంగాణ వాణి ప్రతినిధి): తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామంలో ప్రజపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు గ్రామ సర్పంచ్ సోలిపురం అశ్విని అధ్యక్షతన, స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో శేషు ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర గీతంతో ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రధాన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ముఖ్యంగా రైతు భరోసా పథకం, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, సన్న రకం వడ్ల కొనుగోలుకు బోనస్, చేయూత పెన్షన్లు, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే వెలుగుపల్లి గ్రామంలో ఉన్న తాగునీటి సమస్య, వీధి లైట్ల సమస్యలను పరిష్కరించామని త్వరలో గ్రామంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్ల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

గ్రామ కార్యదర్శి రఘు మాట్లాడుతూ వెలుగుపల్లి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు 32 సాంక్షన్ అవ్వగా, అందులో 28 మంది నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పల్లె దవాఖాన డాక్టర్ విజయ్ మాట్లాడుతూ గ్రామంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని, వచ్చిన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్ పరీక్షలు, వ్యాక్సినేషన్ సేవలు అందిస్తూ అవసరమైన మందులు కూడా అందజేస్తామని చెప్పారు. లైన్మెన్ శేఖర్ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 700 విద్యుత్ సర్వీసులు ఉండగా, అందులో 659 సర్వీసులకు ఉచిత విద్యుత్ అందుతున్నదని, మిగిలిన 41 కమర్షియల్ సర్వీసులు ఉన్నాయని తెలిపారు. అలాగే ప్రాథమిక మరియు హైస్కూల్ హెడ్మాస్టర్లు మాట్లాడుతూ గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. గ్రామ పెద్దలు కొంతమంది మాట్లాడుతూ ఐకేపీ సెంటర్ల నిర్వహణపై వివరాలు ఇవ్వాలని కోరారు. అలాగే రుద్రమ్మ చెరువులో కొంతమంది అక్రమంగా మోటర్లు ఏర్పాటు చేసి నీటిని వృథా చేస్తున్నారని సమస్యను ప్రస్తావించారు. ఈ విషయాలన్నింటికీ ఎంపీడీవో శేషు సమాధానాలు ఇస్తూ, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి గ్రామసభను విజయవంతంగా ముగించారు. గ్రామ సభలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, మల్టీ పర్పస్ వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని గ్రామసభను విజయవంతశీ చేశారు

# పటాన్ చెరు లో శోభాయమానంగా హనుమాన్ జయంతి వేడుకలు

### ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్ చెరు, ఏప్రిల్ 2, (తెలంగాణ వాణి రిపోర్టర్): పటాన్ చెరు పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు శోభాయమానంగా జరుగుతున్నాయి. గురువారం హనుమాన్ జయంతి ని పురస్కరించు కొని పటాన్ చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్, మహాదేవుని ఆలయం, చైతన్య నగర్, నర్ర బస్తి, శాంతినగర్, జెపి కాలనీ పంచ ముఖి హనుమాన్ దేవాలయాలలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులందరూ సనాతన ధర్మాన్ని ఆచరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.. భారతీయ పురాణాలలో అపారమైన భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీకగా నిలిచిన హనుమంతుని జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శ ప్రాయంగా నిలుస్తుందని అన్నారు. నేటితరం యువతకు స్ఫూర్తి దాయకమని అన్నారు. అనంతరం పంచముఖి హనుమాన్ దేవాలయం వద్ద వీర హనుమాన్ శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు.

# గ్రామాల సమస్యల పరిష్కారమే గ్రామ సభల నిర్వహణ ఉద్దేశ్యం

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, ఏప్రిల్:02(తెలంగాణ వాణి ప్రతినిధి): గ్రామాల సమస్యల పరిష్కారమే గ్రామ సభల నిర్వహణ ముఖ్య ఉద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం నిర్మల్ గ్రామీణ మండలం వెంగ్వాపేట్ గ్రామ పంచాయతీ భవన ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఉన్నతికి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు తదితర ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ఎందరో మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. దాదాపు జిల్లాలో 60 వేల రేషన్ కార్డులను ఇవ్వడం జరిగిందని అన్నారు. గ్రామ సభల ద్వారా గ్రామాల్లో గల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని కలెక్టర్ వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి, గ్రామాలలో నెలకొన్న సమస్యలను చర్చించి పరిష్కరించుకోవాలని అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులన్నీ జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి గ్రామాలు పట్టణాలు అన్ని పరిశుభ్రంగా మార్చామని వివరించారు. అతి త్వరలోనే వైద్య కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# 'రాకాస' టీమ్ తో రామ్ చరణ్ చిట్ చాట్..



సంగీత్ శోభన్ హీరోగా, నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్న ఫాంటసీ కామెడీ చిత్రం 'రాకాస'. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న తరుణంలో చిత్ర యూనిట్‌కు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నుంచి అనూహ్యమైన మద్దతు లభించింది. ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' అనే స్పోర్ట్స్ డ్రామాలో నటిస్తున్న రామ్ చరణ్, తన సెట్స్‌కు వచ్చిన 'రాకాస' చిత్ర బృందంతో కాసేపు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా సినిమా గురించి అడిగి తెలుసుకున్న చరణ్, టీమ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రామ్ చరణ్ ప్రశంసలతో తమలో కొత్త ఉత్సాహం నిండిందని 'రాకాస' చిత్ర బృందం సోషల్ మీడియా ద్వారా ఆనందం వ్యక్తం చేసింది. ఈ కలయికకు సంబంధించిన ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. మెగా డాటర్ నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై జీ స్టూడియోస్‌తో కలిసి 'రాకాస' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మనసా శర్మ ఈ చిత్రంతోదర్శకురాలిగా పరిచయమవుతున్నారు. వెన్నెల కిషోర్, తనికెళ్ల భరణి, గెటప్ శ్రీను కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 3న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ఒకరోజు ముందుగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఎంపిక చేసిన నగరాల్లో పెయిడ్ ప్రీమియర్ షోలను ప్రదర్శించేందుకు నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

## రణబాలి షూటింగ్ వీడియో లీక్..

# విజయ్ పవర్ ఫుల్ డైలాగ్‌కి ఫ్యాన్స్ ఫిదా



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మంధాన మూడోసారి జంటగా నటిస్తున్న చిత్రం రణబాలి. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రారంభం నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన విజయ్-రష్మిక పెళ్లి ఫోటో, "ఏందయ్యా సామీ" పాటకు వచ్చిన స్పందనతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. ఈ క్రమంలో సోషల్ మీడియాలో 'రణబాలి' కథ ఇదేనంటూ ఓ కథనం కూడా వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న కథ ప్రకారం, 'రణబాలి' 1876 ప్రాంతంలో బ్రిటిష్ పాలనలో ఉన్న రాయలసీమ నేపథ్యంలో సాగుతుంది. కరువు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో, బ్రిటిష్ అధికారి ప్రజలను మరింత దెబ్బతీసే విధంగా ఆర్టిఫిషియల్ ఫామైన్ సృష్టిస్తాడు. ధాన్యాన్ని గిడ్డంగుల్లో నిల్వచేసి ప్రజలను ఆకలితో వేదించే ఈ క్రూర యత్నం కథకు ప్రధాన నేపథ్యంగా నిలుస్తుంది. ఈ పరిస్థితుల్లో రంగంలోకి దిగే హీరో రణబాలి. ఒకప్పుడు చిన్న సంస్థానానికి వారసుడైన అతను, ప్రజల కోసం పోరాడే యోధుడిగా మారతాడు. బ్రిటిష్ అధికారులకు అతను ప్రమాదకరుడిగా కనిపించినా, ప్రజల దృష్టిలో మాత్రం ఆశగా నిలుస్తాడు. ఇక హీరోయిన్ జయమ్మ పాత్రలో రష్మిక కనిపించనుంది. కరువు తన కుటుంబాన్ని దెబ్బతీసినా ధైర్యంగా నిలిచే జయమ్మ, రణబాలి పోరాటానికి భావోద్వేగ బలం అవుతుంది. వీరిద్దరి మధ్య ప్రేమ సహజంగా, గ్రామీణ నేపథ్యంతో ముడిపడి ఉంటుంది. కథలో రణబాలి గెరిల్లా యుద్ధంతో బ్రిటిష్ గిడ్డంగులపై దాడులు చేస్తూ, ప్రజలకు ఆహారం పంచడం, దేశ సంపదను విదేశాలకు తరలించే ప్రయత్నాలను అడ్డుకోవడం వంటి అంశాలు ఉంటాయని తెలుస్తోంది. అలాగే ఆ సంపదతో ప్రజలకు సహాయం చేస్తూ ఆశ నింపే పాత్రగా అతను నిలుస్తాడు. ఈ పోరాటాన్ని అణిచివేయడానికి బ్రిటిష్ అధికారి రణబాలి తలను తీసుకొచ్చిన వారికి భారీ బహుమతి ప్రకటిస్తాడు. అక్కడినుంచి కథ మరింత ఉత్కంఠభరితంగా మారుతుంది. చివరికి బ్రిటిష్ రికార్డుల ప్రకారం రణబాలి మరణించినట్లు చూపించినా, ప్రజల మనసుల్లో అతను చిరస్థాయిగా నిలిచే నాయకుడిగా మిగిలిపోతాడనే ట్విస్ట్ కథలో ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే తాజాగా రణబాలి షూటింగ్ లొకేషన్ నుండి విజయ్ దేవరకొండకి సంబంధించిన వీడియో ఒకటి లీక్ అయింది. ఇందులో విజయ్ చేతిలో కత్తి పట్టుకొని గుర్రంపై ఇళ్లలోకి వచ్చి.. ఒరేయ్ ముండమోపి నా కొడకా...ఏడున్నావ్ రా.. మీ ఇళ్లలోకి వచ్చా.. రా అవ్వా చంపుదువ్ కాని .. అనే డైలాగ్ చెబుతాడు. చూస్తుంటే విజయ్ ఈ సినిమాతో మంచి హిట్ కొట్టేలా ఉన్నాడని అంటున్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా మెగాస్టార్ ఇంట్లో దైవానుభూతి..



హనుమాన్ జయంతి పర్వదినాన్ని దేశవ్యాప్తంగా భక్తులు ఘనంగా జరుపుకుంటున్నారు. శ్రీరాముడి పరమభక్తుడైన ఆంజనేయస్వామిని ఆరాధిస్తే అన్ని కష్టాలు తొలగిపోతాయని విశ్వాసంతో ప్రజలు పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సినీ ప్రముఖులు కూడా తమ భక్తిని వ్యక్తపరుస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో మెగాస్టార్ చిరంజీవికి ఆంజనేయస్వామిపై ఉన్న భక్తి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిన్నప్పటి నుంచే హనుమంతుడిపై అపారమైన విశ్వాసం కలిగిన ఆయన, తన జీవితంలో ప్రతి విజయానికీ ఆంజనేయుడి ఆశీస్సులే కారణమని ఎన్నోసార్లు వెల్లడించారు. హనుమాన్ జయంతి సందర్భంగా తన నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన చిరంజీవి, ఆ సందర్భంలో చోటుచేసుకున్న ఓ విశేషాన్ని వీడియో రూపంలో అభిమానులతో పంచుకున్నారు. ప్రతి ఏడాది కొన్ని నెలల్లో సూర్యకిరణాలు సప్తవర్ణాలుగా మారి తమ ఇంటి పూజామందిరంలోని హనుమంతుడి విగ్రహాన్ని పై నుంచి కింద వరకు తాకే అద్భుత దృశ్యం కనిపిస్తుందని ఆయన తెలిపారు. ఆ అనుభూతి మాటల్లో చెప్పలేనిదని పేర్కొన్నారు. అలాగే ఇటీవల అయోధ్యలో బాలరాముడి విగ్రహంపై సూర్యకాంతి పడిన సంఘటనను గుర్తుచేసుకుంటూ, కోణార్క్, అరసవిల్లి వంటి దేవాలయాల్లో కూడా ఇలాంటి దైవిక కిరణాలు దర్శనమిస్తాయని చెప్పారు.

అలాంటి అనుభూతి తన ఇంట్లోనూ పొందడం తాను ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. చిరంజీవి తన చిన్ననాటి జ్ఞాపకాలను కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. చదువుకునే రోజుల్లో ప్రతిరోజూ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి ప్రార్థనలు చేసేవాడినని, జీవితంలో ఎలాంటి సమస్య వచ్చినా హనుమంతుడిని ఆశ్రయిస్తే పరిష్కారం దొరుకుతుందని తన అనుభవాన్ని వెల్లడించారు. ప్రస్తుతం చిరంజీవి షేర్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు మెగాస్టార్‌కు హనుమజ్జయంతి శుభాకాంక్షలు తెలుపుతూ స్పందిస్తున్నారు.

# సినిమా



## లవ్ ఫెయిల్యూర్ వెనుక ఉన్న స్టోరీ బయటపెట్టిన అడివి శేష్..



ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్ ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు. విభిన్న కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ సక్సెస్ ఫుల్ హీరోగా నిలిచిన శేష్, ఇప్పుడు తన కొత్త సినిమా డెకాయిట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతుండగా, ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు. ఇటీవల ఒక టీవీ షోలో పాల్గొన్న శేష్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. ముఖ్యంగా తన ప్రేమ కథ గురించి చెప్పడంతో అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శేష్ మాట్లాడుతూ, అమెరికాలో చదువుకుంటున్న సమయంలోనే ఒక అమ్మాయితో ప్రేమలో పడ్డానని తెలిపాడు. ఆ సమయంలో సినిమాలపై ఆసక్తితో అక్కడే ప్రయత్నాలు మొదలుపెట్టినప్పటికీ, తన వ్యక్తిగత జీవితం కూడా అదే సమయంలో కొత్త మలుపు తిరిగిందని చెప్పాడు. ప్రేమలో మునిగిపోయిన తాను ఆ అమ్మాయి కోసం దేశం దాటి కెనడా వరకు వెళ్లినట్లు వెల్లడించాడు. అయితే ఆ ప్రేమ కథ ఎక్కువ కాలం నిలవలేదని, చివరికి లవ్ ఫెయిల్యూర్‌తో ముగిసిందని శేష్ చెప్పుకొచ్చాడు. ఆ అనుభవం తన జీవితంలో ఒక పెద్ద పాఠం నేర్పిందని, తరువాత కెరీర్‌పై పూర్తిగా దృష్టి పెట్టడానికి అదే కారణమైందని వెల్లడించాడు. ఇండస్ట్రీలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా అడుగుపెట్టిన శేష్, తన కృషితోనే ఒక్కో మెట్టు ఎక్కుతూ ఈ స్థాయికి చేరుకున్నాడు. ఇప్పుడు అతను చేసే ప్రతి సినిమా కూడా ప్రత్యేకతతో ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో, డెకాయిట్ పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ ప్రేమకథ బయటకు రావడంతో అభిమానులు శేష్ వ్యక్తిగత జీవితంపై మరింత ఆసక్తి చూపుతున్నారు. కెరీర్‌లో విజయాలు సాధించిన అతని జీవితం వెనుక ఇలాంటి భావోద్వేగ కథ ఉందని తెలుసుకుని సోషల్ మీడియాలో నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

## కేరళలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం ఆవిష్కరణ..

# సంగీత దిగ్గజానికి ఘన నివాళి





భారతీయ సంగీత ప్రపంచాన్ని తన స్వరంతో దశాబ్దాల పాటు అలరించిన గాన గంధర్వుడు బాలసుబ్రహ్మణ్యంకు కేరళలో అరుదైన గౌరవం దక్కింది. పాలక్కాడ్‌లోని వి.టి. భట్ట తిరిప్పాడ్ కల్చరల్ సెంటర్‌లో ఆయన 10 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఆయన కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు, అభిమానుల సమక్షంలో విశేషంగా జరిగింది. సంగీతానికి భాషా, ప్రాంతీయ భేదాలు లేవని మరోసారి కేరళ ప్రజలు నిరూపించారు. పరభాషా గాయకుడైనప్పటికీ ఎస్పీబీపై తమకున్న అపారమైన అభిమానాన్ని ఈ విగ్రహావిష్కరణ ద్వారా తెలియజేశారు. ప్రముఖ శిల్పి ఉన్ని కణయ్ రూపొందించిన ఈ విగ్రహం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమంలో ఎస్పీబీ తనయుడు చరణ్‌తో పాటు ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, గాయకులు మనోజ్, చిత్ర, హరిహరన్, సుజాత్ మోహన్, ఉన్ని మీనన్, విజయ్ ఏసుదాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "సంగీత మేఘం" పేరిట ప్రత్యేక సంగీత విభావరి నిర్వహించి, ఎస్పీబీకి గాన నివాళి అర్పించారు. పలువురు ప్రముఖ గాయకులు ఆయన పాటలను ఆలపిస్తూ భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. గతంలో హైదరాబాద్‌లో ఎస్పీబీ విగ్రహ ఏర్పాటుపై వివాదాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. రవీంద్ర భారతిలో విగ్రహాన్ని ప్రతిష్టించే సమయంలో ప్రాంతీయ వివాదాలు తలెత్తాయి. అయితే కేరళలో మాత్రం ఎలాంటి వివాదాలు లేకుండా ఘనంగా కార్యక్రమం నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కేవలం గాయకుడిగానే కాకుండా, నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్, సంగీత దర్శకుడిగానూ విశేష సేవలు అందించారు. 16 భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించారు. మలయాళంలోనూ ఆయన ఎన్నో గుర్తుండిపోయే పాటలు పాడారు. 2020 సెప్టెంబర్ 25న కరోనా కారణంగా ఆయన కన్నుమూసినా, తన అమర గానంతో సంగీత ప్రియుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. కేరళలో విగ్రహావిష్కరణతో ఆయనకు మరొక చిరస్మరణీయ గౌరవం దక్కిందని అభిమానులు భావిస్తున్నారు.





## సమ్మర్ కు ముందే పడిపోతున్న

# భూగర్భ జలాలు

హైదరాబాద్., : హైదరాబాద్‌లో భూగర్భ జలాలు తగ్గడంతో నీటి ట్యాంకర్ల డిమాండ్ భారీగా పెరిగింది. మార్చిలోనే రోజువారీ ట్యాంకర్ల బుకింగ్స్ 8500 మార్కును చేరగా.. ఏప్రిల్ నాటికి ఇది 10 వేలకు చేరుతుందని జలమండలి అంచనా వేస్తోంది. గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్ వంటి ఐటీ ప్రాంతాల్లో బోర్లు ఎండిపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్ల ధరలు పెరిగాయి. జలమండలి 1100 ట్యాంకర్లతో సరఫరాను ముమ్మరం చేసినప్పటికీ.. పెరుగుతున్న ఎండల దృష్ట్యా నీటి ఎద్దడి మరింత పెరిగేలా కనిపిస్తోంది. సమ్మర్ వచ్చిందంటే చాలు హైదరాబాద్ నగరంలో నీటి ఎద్దడి మొదలవుతుంది. ఇది ప్రతి ఏడాది ఉండే తంతే. అయితే ఈసారి కాస్త ముందుగానే నగర ప్రజలకు నీటి కష్టాలు మొదలయ్యాయి. నగరంలో వేసవి వేడి సెగలు మొదలవకముందే మంచినీళ్ల కష్టాలు ముదిరిపోయాయి. వాతావరణ మార్పులు, అడుగంటిపోతున్న భూగర్భ జలాల కారణంగా నగరవాసులు చుక్క నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత నెల రోజుల్లోనే నీటి ట్యాంకర్ల డిమాండ్ అనూహ్యంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఫిబ్రవరి చివరలో రోజుకు సగటున 5 వేల ట్యాంకర్ల కంటే తక్కువ డిమాండ్ ఉండగా.. మార్చి నెలాఖరు నాటికి ఆ సంఖ్య 8,500కు చేరుకుంది. ఏప్రిల్ నాటికి ఈ డిమాండ్ రోజుకు 10 వేల ట్యాంకర్లకు చేరుకోవచ్చని జలమండలి అంచనా వేస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరం పశ్చిమ భాగంలోని ఐటీ కారిడార్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, కూకట్‌పల్లి, నిజాంపేట వంటి ప్రాంతాలతో పాటు ఉప్పల్, మల్కాజిగిరి, అమీర్‌పేట ఏరియాల్లో 50 శాతానికి పైగా బోర్లు అడుగంటిపోయాయి. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు ఇప్పుడు పూర్తిగా ట్యాంకర్ల మీదే ఆధారపడుతున్నాయి. హాస్టళ్లు, వాణిజ్య సముదాయాల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండటంతో నిత్యం బోర్లపైనే ఆధారపడే వీరంతా ఇప్పుడు నీటి కోసం అల్లాడుతున్నారు. జలమండలి నిబంధనల ప్రకారం 24 గంటలకు ఒకసారి మాత్రమే ట్యాంకర్ బుక్ చేసుకునే అవకాశం ఉండటంతో.. ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకులు ధరలను భారీగా పెంచేశారు. గతం కంటే ఒక్కో ట్యాంకర్‌పై రూ. 200 నుండి రూ. 500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దూరం, అవసరాన్ని బట్టి రేట్లను ఇష్టానుసారంగా నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా జలమండలికి చెందిన 1,100 ట్యాంకర్లు 140 ఫిల్లింగ్ పాయింట్ల ద్వారా నిరంతరాయంగా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోవడం సవాలుగా మారింది. ఏప్రిల్, మే నెలల్లో ఈ కష్టాలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా, కొందరు ప్రైవేట్ ట్యాంకర్ యజమానులు అనధికారికంగా జలమండలి అధికారిక లోగోను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలా లోగో వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి హెచ్చరించారు. ఇటీవల కొందరు ప్రైవేట్ బోర్‌వెల్ ట్యాకర్ల ఆపరేటర్లు లోగో, బ్రాండ్‌ను వినియోగిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇలా చేయటం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడమే కాకుండా మోసపూరిత చర్యగా గుర్తిస్తామన్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా భావించి లోగో దుర్వినియోగం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ హెచ్చరించారు.

## ఘనంగా సర్దార్ పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు



మందమర్రి టౌన్ ఏప్రిల్ 02 (తెలంగాణ వాణి విలేకరి):మందమర్రి పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం శ్రీ మహారాజా సర్దార్ పాపన్న గౌడ్ 316 వ వర్ధంతి వేడుకలను పాత బస్టాండ్ సమీపం లోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ఆవరణలో భక్తి, గౌరవ వాతావరణం లో ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 17వ శతాబ్దంలో మొఘల్ నిరంకుశ పాలనకు వ్యతి రేకంగా పోరాడిన బహుజ న చక్రవర్తి అని, ఖిలాషా పూర్ గ్రామంలో జన్మించిన ఆయన గోల్కొండ కోటను ఆక్రమించి, స్వతంత్ర రాజ్యాలు స్థాపించారని గుర్తు చేశారు. సర్దార్ పాపన్న గౌడ్ సామాజిక న్యాయం కోసం, పీడిత వర్గాల హక్కుల కోసం పోరాడిన మహానుభావు డని కొనియాడారు. ఆయన త్యాగాలు, పోరా ట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొ న్నారు. సమాజంలో సమానత్వం, స్వాభిమానం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమం లో మడిపల్లి వెంకటేష్ గౌడ్, సావుల వెంక గౌడ్, గొడిసెల రాజా గౌడ్, గొడిసెల శంకర్ గౌడ్, వీరగోని భాస్కర్ గౌడ్, గడ్డం రవి గౌడ్, బుర్ర ఆంజనేయులు గౌడ్, పంజాల రాజా గౌడ్, కె వెంక గౌడ్, కత్తి నరస గౌడ్, సింగారపు లక్ష్మణ్ గౌడ్, అరిగెల రమేష్ గౌడ్, తాళ్లపల్లి గంగాగౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

## గ్రామాల సమస్యల పరిష్కారమే గ్రామ సభల నిర్వహణ ఉద్దేశ్యం

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్, ఏప్రిల్:02(తెలంగాణ వాణి ప్రతినిధి): గ్రామాల సమస్యల పరిష్కారమే గ్రామ సభల నిర్వహణ ముఖ్య ఉద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం నిర్మల్ గ్రామీణ మండలం వెంగ్వాపేట్ గ్రామ పంచాయతీ భవన ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఉన్నతికి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు తదితర ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ఎందరో మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. దాదాపు జిల్లాలో 60 వేల రేషన్ కార్డులను ఇవ్వడం జరిగిందని అన్నారు. గ్రామ సభల ద్వారా గ్రామాల్లో గల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని కలెక్టర్ వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి, గ్రామాలలో నెలకొన్న సమస్యలను చర్చించి పరిష్కరించుకోవాలని అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులన్నీ జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి గ్రామాలు పట్టణాలు అన్ని పరిశుభ్రంగా మార్చామని వివరించారు. అతి త్వరలోనే వైద్య కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అధికారులంతా జవాబుదారీతనంతో పని చేస్తూ, స్థానిక సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామ సభలో భాగంగా, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన గ్రామస్తుల వివరాలు చదివి వినిపించారు. ప్రజల కొరకు ప్రభుత్వం అమలుపరుస్తున్న పథకాలను గురించి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు అన్ని పథకాలను సద్వినియోగపరుచుకోవాలని చెప్పారు. ఈ గ్రామసభలో డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వనిత, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బండి సదానందం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



మందమర్రి టౌన్ ఏప్రిల్ 02 (తెలంగాణ వాణి విలేకరి ): మందమర్రి పాత బస్టాండ్ ఏరియాలో అఖిల భారత యాదవ సంఘం నాయకులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బండి సదా నంద యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత చలివేంద్రాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా బండి సదానందం మాట్లా డుతూ కాకా వెంకట స్వామి జ్ఞాపకార్థం మందమర్రి పాత బస్టాండ్ చలివేంద్రాన్ని ప్రారంభించ డం జరిగిందని తెలిపారు. చెన్నూరు శాసనసభ్యులు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట స్వామి ఆధ్వర్యంలో చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముం దుకు వెళుతుందని అందు లో భాగంగానే ఈరోజు స్వర్గీయ కాకా వెంకట్ స్వామి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ప్రారంభించ డం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమం లో బత్తుల తిరుపతి నాగుల దుర్గ య్య, తోట నరహరి, రామస్వామి, ఆర్.రామ్ రెడ్డి, ఆటో యూనియన్ రామిరెడ్డి, తోటరాజు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న 316వ వర్ధంతి



రాజాపేట ఏప్రిల్: 02(తెలంగాణ వాణి విలేకరి): రాజపేట మండల కేంద్రంలో శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు పాండవుల లక్ష్మణ్ గౌడ్, గౌరవ అధ్యక్షులు గోపగాని యాదగిరి గౌడ్ కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ ఉపాధ్యక్షులు గోపాల్ గౌడ్ రమేష్ గౌడ్ మాజీ ఎంపీపీ గోపగాని బాలమని ఉప సర్పంచ్ కేదారి గౌడ్ మదర్ డైరీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉప్పలయ్య గౌడ్ నర్సింగ్ గౌడ్ సంపత్ గౌడ్ నవీన్ డాక్టర్ చింతల రవి తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పొన్నం సదుద్దేశం

# పక్కదారి

- హుస్నాబాద్‌లో సామాన్యుడి పరిస్థితి ఇది.!
- ట్రాఫిక్ నియంత్రణ అంటే అవగాహనా? లేక చలాన్ల వసూళ్లా?
- క్షేత్రస్థాయిలో వేదింపులుగా మారిన ట్రాఫిక్ నిబంధనలు

హుస్నాబాద్, ఏప్రిల్ 02 (తెలంగాణ వాణి ప్రత్యేక ప్రతినిధి): ఏ సమాజంలోనైనా క్రమశిక్షణ అవసరమే, కానీ ఆ క్రమశిక్షణ సామాన్యుడి పాలిట శాపంగా మారకూడదు. హుస్నాబాద్ పట్టణంలో ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే చట్టం అమలు తీరు వివాదాస్పదంగా మారింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ పట్టణ రవాణా వ్యవస్థను చక్కదిద్దాలని, ప్రమాదాలను అరికట్టాలనే సదుద్దేశంతో ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేశారు. అయితే, లక్ష్యం మంచిదే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో విధుల్లో ఉన్న సిబ్బంది వ్యవహారశైలి వల్ల ఈ వ్యవస్థ ఇప్పుడు పేద ప్రజల పాలిట యమపాశంలా మారింది. నిబంధనల అమలులో పోలీసులు చూపుతున్న అతి ఉత్సాహం పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే రైతులను బెంబేలెత్తిస్తోంది.

?హుస్నాబాద్ పట్టణం ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలపై ఆధారపడి ఉంటుంది. ప్రతిరోజూ వందలాది మంది తండా వాసులు, గ్రామీణ రైతులు తమ పండించిన పంటలను విక్రయించడానికి లేదా నిత్యావసర వస్తువుల కొనుగోలు కోసం పట్టణానికి వస్తుంటారు. వీరిలో అత్యధికులు నిరక్షరాస్యులు లేదా ట్రాఫిక్ నిబంధనల పట్ల కనీస అవగాహన లేని వారు. లైసెన్స్ అంటే ఏమిటో, దానిని ఎలా పొందాలో తెలియని అమాయక రైతులను ఆపి, ఏకంగా ఐదు వేల రూపాయల జరిమానా విధించడం ఏ రకమైన న్యాయమని మేధావులు ప్రశ్నిస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని ఆ పేద కుటుంబాలు, రోజంతా కష్టపడితే వచ్చే ఆదాయం ఆ జరిమానాలో పదో వంతు కూడా ఉండదు. అలాంటి పరిస్థితుల్లో వేలల్లో జరిమానాలు విధిస్తూ, కచ్చితంగా కోర్టుకు వెళ్లాలని బైకులను సీజ్ చేయడం వల్ల సామాన్యులు మానసికంగా, ఆర్థికంగా కుప్పకూలిపోతున్నారు.

చట్టం అందరికీ సమానంగా వర్తించాలనే సూత్రం ఇక్కడ తుంగలో తొక్కుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

తెల్ల బట్టలు ధరించి, రాజకీయ అండదండలు ఉన్న నాయకులను చూసీచూడనట్లు వదిలేస్తున్న పోలీసులు, కేవలం మురికి బట్టలతో, మాసిన తలలతో కనిపించే పేద రైతులను, దూరప్రాంత కాలేజీ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో తనిఖీలు చేస్తున్న సమయంలో పరపతి ఉన్న వ్యక్తులు నిబంధనలు ఉల్లంఘించినా పట్టించుకోని అధికారులు, ముక్కు మొహం తెలియని పల్లెటూరి జనం కనిపిస్తే మాత్రం తమ ప్రతాపం చూపిస్తున్నారు. కేవలం ఒక శుక్రవారం సంత రోజు తప్ప, మిగిలిన రోజుల్లో పెద్దగా ట్రాఫిక్ సమస్యలే లేని హుస్నాబాద్‌లో, ఇలాంటి కఠిన ఆంక్షలు విధించడం వెనుక ఉన్న మర్మం ఏమిటో అర్థం కాక ప్రజలు చర్చించుకుంటున్నారు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలనుండి వచ్చే, రైతులు తమ వాహనాలను పోగొట్టుకుని స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ అంటే కేవలం చలాన్లు వేయడం మాత్రమే కాదు, ప్రజలలో చైతన్యం తీసుకురావడం కూడా అని పోలీసులు గుర్తించాల్సి ఉంది. గ్రామాల్లో ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన సదస్సులు నిర్వహించకుండా, హెల్మెట్ ప్రాముఖ్యత వివరించకుండా, స్టేషన్ హోం గార్డులకు తెల్ల బట్టలు వేసి కెమెరాలు ఇచ్చి నడి రోడ్డుపై నిలబెట్టి వచ్చిపోయే వాహన దారులపై హెల్మెట్, పేరిట ఫోటోలు తీయడం, కొత్తగా వచ్చిన ట్రాఫిక్ పోలీస్ అధికారి లైసెన్స్ పేరిట ఐదు వేలకు తగ్గకుండా జరిమానాలు వేసి నేరుగా కోర్టులో ఫైన్ చెల్లించేలా చర్యలు చేపట్టడం వల్ల ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉంది. ప్రజల సంక్షేమం కోరి మంత్రి పొన్నం ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థ, చివరకు ఆయనకే ప్రతికూలంగా మారుతోందని సామాన్య జనం వాపోతున్నారు.

అధికారులు వాస్తవ పరిస్థితులను గమనించాలి: హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల ఆర్థిక స్థితిగతులను, వారి జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనల అమలులో కాస్త మానవత్వం చూపాలని ప్రజలు కోరుతున్నారు. జరిమానాలే లక్ష్యంగా కాకుండా, అవగాహన కల్పించడమే ధ్యేయంగా ట్రాఫిక్ పోలీసులు వ్యవహరించాలని, మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి ఈ వేధింపుల నుండి తమకు విముక్తి ప్రసాదించాలని హుస్నాబాద్ ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.



## గురుకుల ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

### -ఏప్రిల్ 15 చివరి తేదీ

### -కె కళాశాల ప్రిన్సిపాల్ ఎ. సురేఖ



జహీరాబాద్/టౌన్:ఏప్రిల్ 02(తెలంగాణ వాణి ప్రతినిధి) తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల సంస్థ (టి జి ఆర్ జె సి) ఆధ్వర్యంలో నడుస్తున్న రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు హోతి-కె పిఎం శ్రీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎ సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పదవ తరగతి (మార్చి 2026) పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఎంపీసీ,బైపీసీ, మరియు ఎంఈసీ గ్రూపుల్లో ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలు కల్పిస్తారు. వచ్చే నెల మే 3, 2026న నిర్వహించే 'టిజిఆర్జెసి సెట్-2026' ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రూ.200/- దరఖాస్తు రుసుము చెల్లించి tgrjc.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 15 2026 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. అర్హులైన గ్రామీణ మరియు పట్టణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే సమీపంలోని గురుకుల పాఠశాల లేదా కళాశాలను సంప్రదించాలని ఆమె సూచించారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar
MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com